

భాగవతము
విచారణ
మందార మకరందాలు


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2990100028538


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!



మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

మందార మకరందాలు

బమ్మెర పోతన భాగవతం లోని
కొన్ని పద్యమందారాలకు మకరంద వ్యాఖ్యానం

డా॥ సి. నారాయణరెడ్డి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి
1992

ముందుమాట

• • • • • •

"మందార మకరందాలు" — అనే పదగుంఫనం చెవుల బడగానే తెలుగువారికి తత్‌క్షణం స్ఫురణకు వచ్చేది పోతన మహాకవి వ్రాసిన సుప్రసిద్ధ పద్యం!

పోతన కవిత్వాన్ని ఒక్క ముక్కలో మట్టసంగా కుదించి మదించి చెప్పమంటే — ఎవరైనాసరే — మందార మకరంద మాధుర్యం అంటారు!

"మందార మకరంద మాధుర్యమున దేలు మధుపమ్ము" — వంటి సుప్రసిద్ధ పద్యాలను, తెలుగునాలుకలపై తర తరాలుగా నలిగి నలిగి నానుడులుగా మారిన కవితలను మరి కొన్నింటిని ఏర్చి కూర్చి — అద్యతనాంధ్ర కవితా ప్రపంచంలో గేయ వాఙ్మయ సింధువుగా, సుకుమార సుందర సంగీత సాహితీస్రష్టగా— రసార్ద్రి రమణీయార్థ మాధురీమంత్రద్రష్టగా, సుగృహీత నామధేయులైన —

ఆచార్య డాక్టరు సి. నారాయణరెడ్డిగారు ఈ గ్రంథం సంతరించారు.

ఈ గ్రంథంలో పోతన మహాకవి మందార మకరంద మాధుర్యాలను డాక్టరు సి.నా.రే గారి హృదయంగమ వ్యాఖ్యాన పరిమళం మేళవించినది. ఇది సాహితీప్రియంభావుకుల అదృష్టవిశేషం!

ఇక— మందార మకరంద మాధుర్యాలు మరిగిన సహృదయులకు పోతన భాగవతం సొంతంగా చదవాలనే అభిలాష అంకురించడం సహజం. అదే తిరుమల తిరుపతి దేవస్థానాలవారు కోరుకునేది

తిరుపతి,
అక్టోబరు 25, 1983.

జి. కుమారస్వామి రెడ్డి,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

*

సౌరభం

> "లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం
> జులతాశోభితమున్, సువర్ణసుమనస్సుజ్ఞేయమున్, సుందరో
> జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమలవ్యాసాలవాలంబునై
> వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై."

భక్తికి మారుపేరుగా భాగవతాన్ని చెప్పుకుంటారు తెలుగువారు. దానికి కారణం దానిలో ఉన్న భక్తిగాథలేకాదు-బమ్మెర పోతరాజు కమ్మని కవిత్వం. స్వయంగా భక్తుడై భగవన్నామ స్మరణంచేతనే పారవశ్యాన్ని భజించే చిత్తంతో భగవంతుని ప్రేరణతో-భాగవతరచన చేపట్టాడు పోతన్న. కవిత్వం అతనికి కైవల్యసాధనం. కైవల్యం జ్ఞానంవల్లగాని కైవసం కాదు. నిర్గుణమైన బ్రహ్మాన్ని జ్ఞానంవల్ల పట్టుకోవచ్చు కాని, అది సర్వజనసులభం కాదు. అందరికీ అందు బాటులో ఉండేది భక్తి. భక్తి మార్గం మధురాతిమధురమైనది. సగుణబ్రహ్మను సమాహితంతో సాక్షాత్కరించుకొనటానికి అంతకంటే సులభమైన మార్గం మరొకటి లేదు. 'నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్. రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!' అని ఆక్రందించే ఏ భక్త చిత్తానికైనా భగవంతుడు ప్రత్యక్షమౌతాడు! భక్తరక్షణ కళాపారీణుడైన ఆ భగవంతుడు శ్రీమన్నారాయణుడు కావచ్చు. మూడడుగుల నేలను యాచించే ముగ్ధవటువు కావచ్చు. ముల్లోకాలను బొజ్జలో ఇముడ్చుకొన్న విశ్వరూపుడు కావచ్చు. భక్తుని భావనాపటిమ ననుసరించి భగవంతుడు బహురూపాలతో అవతరిస్తాడు. శిష్టరక్షణంతో పాటు దుష్టశిక్షణం కూడా చేస్తాడు.

భక్తి అనేది ఒకవిధమైన చిత్తపరిపాకం. ఆకలి అవుతున్న పసిబాల అమ్మపాలకోసం అలమటించినట్లుగానే మానవుని అంతరాత్మ అఖండచిన్మయానందంకోసం ఆరాటపడుతుంది. తియ్యని పాలకై తల్లిపాలిండ్లకోసం తడిమే పసికూనలాగానే అంతరాత్మ ఆ అనిర్వచనీయానందానుభూతికోసం అన్వేషణ ప్రారంభిస్తుంది. ఆ అన్వేషణలోనే అంతరాత్మ ఎంతో ఎదుగుతుంది. యౌవనంలో ఉన్న యువతి మనోహరుని మధురానురాగంకోసం ఎలా రతి భావాన్ని భజిస్తుందో, అన్వేషణలో ఆర్తమైన అంతరాత్మ అలా ఆ పరంజ్యోతి పరిష్వంగంకోసం పారవశ్యంతో పలవరిస్తుంది. ఇలా భగవద్రతితో పారవశ్యాన్ని చెందే పరిణతమైన చిత్తపరిపాకమే భక్తి. రతిచ్ఛాయ ఉండటంచేత పైకి అది శృంగారంగా కనపడుతుంది. కాని అది లోకంలో ప్రేయసీ ప్రియులమధ్య కనపడే భౌతికమైన రతి కాదు. జీవాత్మ పరమాత్మల సమైక్యం కోసం ఆంతరమైన చైతన్యం అభిలషించే అవ్యక్తమైన ఆధ్యాత్మిక రతి. అది పరిపూర్ణం. అఖండ ఆనందనిధానం. భాగవతంలో గోపికల ప్రణయతత్త్వం ఇదే.

నల్లనివాఁడు, పద్మనయనంబులవాఁడు, కృపారసంబు పైఁ
జల్లెడు వాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడుమోమువాఁ, డొకఁడు చెల్వల మానధనంబుఁ దోచె నో
మల్లియలార! మీ పొదలమాటున లేఁడుగదమ్మ చెప్పరే?

అని గోపిక అన్వేషించింది గోపాలకృష్ణుణ్ణైనా, పరమార్థంలో పరమాత్మతత్త్వాన్నే! పైకి కనపడుతున్న ఈ స్త్రీపుంస భావంలో నుండి ఒక మధురమైన రతి భావం ప్రతీయమానం అవుతున్నది. ఆ రతి భగవత్పరంగా ప్రవహిస్తుండటం చేత భక్తిగా పరిణమిస్తున్నది. ఈ భక్తి ఇంద్రియపరితృప్తికోసం లక్షించిందికాదు. భవబంధవిముక్తికోసం ప్రవర్తించింది. వేణుగానలోలుని కళ్యాణ

విగ్రహాన్ని కన్నులారా గాంచిన ఆ గోపకాంతలు-పరమేశ్వరుణ్ణి దర్శించిన భాగవతోత్తముల్లాగా పరమానందాన్ని పొంది. తరించారు.

" క. హరి సురుచిర లలితాకృతిఁ
దరుణులు గని ముక్తవిరహతాపజ్వర లై
పరమోత్సవంబు సలిపిరి
పరమేశ్వరుఁ గనిన ముక్తబంధుల భంగిన్."

అని పోతన్న వర్ణించాడు! ఉద్దిష్టతాత్పర్యాన్ని ఉపమానంలో ఉంచి ఉజ్జ్వలం చేశాడు. శృంగారం యవనికగా భగవద్భక్తి లాస్యం చేసిన కవితారంగం భాగవతగ్రంథం!

భాగవతభక్తులలో తమోగుణ ప్రధానుడైన గజేంద్రు డున్నాడు: రజోగుణ ప్రధానుడైన ధ్రువు డున్నాడు: సత్త్వగుణ ప్రధానుడైన ప్రహ్లాదు డున్నాడు. రక్తితో ఆరాధించే రమణు లున్నారు. రాజసంతో సేవించే రాజర్షు లున్నారు. భిన్నరుచులు గల లోకం ఇన్ని విభిన్న ప్రవృత్తులు గల భాగవత భక్త లోకంలో ఎక్కడో ఒక్కచోట తన చిత్తవృత్తికి అభిన్నంగా ఉన్న సన్నివేశంలో రమిస్తుంది. అప్పుడు పరవశిస్తుంది. ఆ పార వశ్యంలో భక్తి ఉజ్జ్వలంగా వెలుగొందుతుంది. సర్వమానవ హృదయాంతరాళాల్లో భక్తి ప్రసూనాలను పరిమళింపచేసే సాహిత్యకల్పవృక్షం భాగవతమహాపురాణం.

బమ్మెర పోతన్న మహాభక్తుడే కాక సహజకవితాధురీణుడు కావటంచేత భాగవత భక్తులందరిలో తాను తాదాత్మ్యం చెంది కవితా వేణువును మ్రోగించాడు. అంతరాత్మలో తరంగితమయ్యే భక్తి భావలహరి కవితాస్రవంతిగా అతని నాలుకపై తురగలించి పద్యతరంగాలుగా భాగవతంలో ప్రవహించింది. అందువల్లనే మూలంకంటె ఈతని రచన మూడింతలు పెరిగింది.

"తనుహృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా
ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్, హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా!"

అని ప్రహ్లాదుని నోట చెప్పించిన నవవిధ భక్తిమార్గాలనూ భాగవతంలో నవ నవోన్మేషంగా పోషించాడు పోతన్న. భగవద్విధేయులైన భక్తుల నోట పరమరమణీయంగా భక్తిని పొంగించటమే కాకుండా భగవద్విరోధుల నోటకూడా నిందలో స్తుతి నిగూఢంగా అనుసంధించాడు పోతన్న.

భక్తి కవితలో రక్తి కట్టాలంటే శ్రవణం, సంకీర్తనం, చింతనం అనే భక్తిమార్గాల కది పరిపోషకంగా ఉండాలి. కవితకు లలితశబ్దసంయోజనంవల్లా, మధురాక్షరపునరావృత్తివల్లా, అనుప్రాసయమకాది శబ్దాలంకార సంవిధానం వల్లా శ్రవణసుభగత్వం అలవడుతుంది. ధారావాహితమైన కవిత్వంవల్లా భగవద్గుణ సంకీర్తనంవల్లా, రాగరంజితమైన శైలివల్లా, అలవోకగా అవధానం చేయగలిగే పద్యవిద్యవల్లా కవితలో సంకీర్తనకు సౌలభ్యం ఏర్పడుతుంది. భావనాగంభీరాలైన అర్థాలంకారాలవల్లా, ఆలోచనామృతాన్ని వర్షించే సార్థక పదప్రయోగం వల్లా, వ్యంగ్య సౌరభాన్ని వెదజల్లే వాక్యవిన్యాసంవల్లా, అరటి పండొలిచి పెట్టినట్లు అభివ్యక్తం చేసే తాత్త్విక తాత్పర్యంవల్లా కవిత్వం పఠితలలో చింతనను రేకెత్తింపజేస్తుంది. బమ్మెర పోతన్న కవిత్వం ఈ లక్షణాల నన్నింటినీ సలక్షణంగా సమన్వయించుకొన్నది.

'మందారమకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు ?'

ఇటువంటి రచనలోని మాధుర్యం శ్రవణాన్ని ఆకట్టుకుంటుంది.

'కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ'

ఇటువంటి రచనలో సంకీర్తనం స్వాదువుగా వినిపిస్తుంది.

ఇందుఁ గలఁ డందు లేఁ డని
సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దానవాగ్రణి వింటే!'

వంటి పద్యాలు పఠితల్లో తాత్త్వికచింతనాన్ని ప్రేరేపించే హృద్య పద్యోపనిషత్తులు.

'అమ్మలఁ గన్న యమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాలఁ బె
ద్దమ్మ, సురారులమ్మ, కడుపాఱడిపుచ్చిన యమ్మ, దన్ను లో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గ, మా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వపటుత్వసంపదల్.'

వంటి పద్యాల్లో కనపడే వృత్త్యనుప్రాసం వట్టి శబ్దాడంబరం కాదు. పఠితలను మైమరపించే సమ్మోహనమంత్రం. తేట తెలుగు మాటలే కావు. దీర్ఘ సంస్కృత సమాసాలుకూడా మందార మకరంద ప్రవాహంగా పోతన్న కవితలో తరుగని రుచుల నీనుతుంటాయి. చూడండి!

'శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హారతుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సుధా పయోధి సితతామర సామరవాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు భారతీ!'

పోతన్న భక్తి కవిత్వమే ఆంధ్రమహాభాగవతానికి ప్రాణం. తెలుగు దనం తేటపడే అతని వాక్పాకం స్వచ్ఛమైన అతని శీలానికి ప్రతిబింబం. రాజుల నీసడించి. రాముణ్ణి ఆశ్రయించి. భోగాలను గర్హించి. భగవంతుణ్ణి కీర్తించిన పోతన్న జీవితం ఉత్తమ మానవతకు ఉజ్జ్వల మణిదర్పణం.

'నీ పాదకమల సేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యమును, నితాం
తాపార భూతదయయును
దాపసమందార, నాకు దయసేయఁగదే.'

అని భక్తితోపాటు భూతదయను ప్రసాదింపుమని భగవంతుని కోరుకొన్నట్టి దయామూర్తి పోతన్న. అతని భూతదయ తెలుగులోకంమీద ప్రసరించింది. ప్రజలు కలకాలం పాడుకొనటానికి అనువైన భాగవతరచనంగా అది పరిణమించింది. పోతన భాగవతం ప్రజలకోసం వ్రాసినాడు. భగవంతునిమీద నమ్మకం లేని పచ్చి నాస్తికుడైనా అతని పలుకుబడికి పారవశ్యం పొందవలసిందే! జాతిలో ఈ కవి పద్యాలు, పదబంధాలూ, లోకోక్తులూ వాచవిని కల్పిస్తూ వ్యవహారంలో విరివిగా ప్రచారంలో ఉన్నవి. భాగవతంలో కనీసం ఒక పద్యమైనా నోటికిరాని తెలుగువాడు తాను తెలుగువాణ్ణని చెప్పుకోటానికి సిగ్గుపడతాడు.

ఇంతటి ప్రజాదరాన్ని చూరగొన్న బమ్మెర పోతన్న కవిత్వంలోని ప్రసిద్ధపద్యాలను ఎన్నిక చేసి మందారాలవంటి మహనీయమైన ఆ పద్యాలలోని మకరంద మాధుర్యాన్ని పఠితలకు చవి చూపించి మురిపించేలా మనోజ్ఞమైన వ్యాఖ్యానాన్ని మధురకవులు డా॥ సి. నారాణయరెడ్డిగారు వ్రాయడం బంగారానికి తావి కల్పించటం వంటిది.

డా॥ సి. నారాయణరెడ్డిగారు భాగవతప్రాశస్త్యాన్నీ, పోతన వ్యక్తిత్వాన్నీ కవితామాధుర్యాన్నీ వ్యక్తీకరించే కమ్మనిపద్యాలనిందులో ఎన్నుకొన్నారు. భాగవతపద్యాల చుట్టూ పరివేషంగా పరిమళించే తాత్త్వికసౌరభాన్నీ, రచనలో అంతర్భూతంగా అందగించుకొన్న కళాసామ్రాజ్యాన్నీ పుక్కిటపట్టే సరళ సుందరమైన శైలిలో వ్యాఖ్యానం రచించారు. 'మందారమకరందాల'ను చదివే పఠితకు ఈ వ్యాఖ్యానం చదువుతున్నట్లనిపించదు. నారాయణరెడ్డిగారు మధురంగా మాట్లాడుతుంటే వింటున్నట్లుంటుంది. పోతన పద్యంలో కవి వ్యక్తిత్వంలాగానే వ్యాఖ్యానంలో వ్యాఖ్యాత వ్యక్తిత్వం ప్రత్యక్షమౌతుంది. పోతన్న కవితాతత్త్వాన్ని సాక్షాత్క

రింపచేసే పద్ధతితోపాటు, కొన్ని పద్యాల్లోని భావాలను క్రొత్త చూపుతో సమీక్షించే ప్రత్యేకతను ప్రదర్శించారు శ్రీ నారాయణ రెడ్డిగారు. పోతన ప్రజాకవిగా ప్రఖ్యాతి పొందటానికి కారణాలైన ఆయువు పట్టుల్ని ఎత్తి చూపించారు. పోతన కవితలో కట్టిన బొమ్మలు, అక్షరాలలో అమర్చిన శిల్పాలు, పాత్రల మనః ప్రవృత్తికి ఛందం పట్టిన దర్పణాలు, ఉక్తివైచిత్రుల వలన వ్యక్తమయ్యే చమత్కారాలూ తెలుగుదనం తొలకరించే తియ్యని అందాలూ, ప్రజల నాలుకలపై నిత్యవ్యవహారంలో క్రొత్త అర్థాలను సంతరించు కొన్న పోతన పద్యపాదాలూ-ఇలా ఎన్నో విశేషాలు నారాయణరెడ్డిగారి వ్యాఖ్యలో మెరుపుల్లా మెరుస్తున్నవి. కవితాత్మను దర్శించిన ఒక ప్రసిద్ధాధుని కాంధ్రకవి భక్తికవితా సుధానిధియైన బమ్మెర పోతరాజు కవితాహృదయాన్ని ఆవిష్కరించిన లఘువ్యాఖ్యాగ్రంథ మిది.

ఈ ముందు మాటలను ముగించే ముందు మందార మకరందాల పద్య సంకలనవిధానాన్ని గురించి ఒక విషయాన్ని మనవి చేయాలి. ఆంధ్రమహాభాగవతం పన్నెండు స్కంధాలలో వ్రాయబడిన మహాపురాణం. ఆంధ్రమహాభారతం వలెనే భాగవతం కూడా ఒక్కచేతిమీద నడవలేదు. అక్కడ ముగ్గురు కవులైతే ఇక్కడ నలుగురు కవులు. భాగవతరచనలో బమ్మెర పోతన్న ప్రధానుడు. భక్తిరసప్రధాన ఘట్టాలన్నీ ఆయన గంటంనుండే వెలువడి ఉండటం తెలుగువారి అదృష్టం. భాగవతంలో కొన్ని భాగాలను మరో ముగ్గురు కవులు అనువదించారు. వారిలో వెలిగందల నారయ ముఖ్యుడు. ఏకాదశ ద్వాదశస్కంధాలు పూర్తిగా, ద్వితీయదశమోత్తరస్కంధాలలో కొంతభాగం ఆయన రచన. పంచమస్కంధం గంగన్న, షష్ఠస్కంధం సింగన్న తెనిగించినారు. పోతన్న గతించిన తర్వాత శిథిలమైన భాగాలను ఈ ముగ్గురూ

పూరించాలని, పోతన్నగారే వారిని ప్రోత్సహించి భాగవతరచనలో భాగం కల్పించారనీ—ఎన్నో కథలూ, వాదాలూ ఉన్నాయి. ఇందులో రెండోవాదమే సత్యానికి సన్నిహితంగా ఉన్నదని పలువురి తలంపు. ఏమైనా ఇందులో ఎన్నిక చేసిన పద్యాలన్నీ పోతన్న భాగవతరచనంలోనివే. ప్రసిద్ధమైన పద్యాలు వందల కొద్దీ ఉన్నా శిల్పవైవిధ్యం దృష్టిలో ఉంచుకొని, పరిమితమైన పుటల్లో పరిమితమైన పద్యాల్నే-సామాన్యప్రజలకు మరీ సన్నిహితంగా ఉన్న వాటిని— ఎన్నుకోవటం జరిగింది.

ఆ పద్యాలను సంకలనం చేయుటంలో భాగవతంలో ఉన్న క్రమాన్ని అంతటా పాటింపలేకపోయినా, ఒక సమన్వయ సూత్రంతో సంపుటీకరించటం జరిగింది. అవతారికలోని పద్యాలూ, పోతన కవితామాధుర్యవిశేషాలను తెలిపే పద్యాలూ, అవతారకథల్లోని పద్యాలూ, చివరకు శ్రీకృష్ణావతారంలో బాలకృష్ణుని లీలావినోదాలూ, గోపికాకృష్ణుని బృందావన విహారాలు, ప్రౌఢకృష్ణుని పరిణయ ప్రాభవాలు వర్ణించే పద్యాలూ— ఈ వరుసలో కూర్పు సాగింది. శ్రీకైవల్యపదంబు జేరుటకునై ..... అనే మంగళాశాసనంతో మొదలైన ఈ సంకలనం త్రివిక్రమావతారస్ఫూర్తితో విస్తరిల్లి, రుక్మిణీ కల్యాణంతో శుభాంతంగా ముగుస్తున్నది. 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని కావ్యాని ప్రథన్తే' అని కదా న్యాయం! ఈ సంకలనానికి ఈ సంవిధానం ఒక చక్కని క్రమపరిణామ రామణీయకత్వం సంతరిస్తున్నది.

— డా॥ సి. వి. సుబ్రహ్మణ్యంగారి మునుడి నుంచి.

★

మందార మకరందాలు

శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో
ద్రేకస్తంభకుఁ గేళిలోలవిలస ద్దృగ్జాలసంభూత నా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్.

శ్రీమదాంధ్రమహాభాగవతంలోని మొదటి పద్య మిది. అంటే సంస్కృత నాటకాల్లోని నాందీశ్లోకం లాంటిది. కావ్య ప్రారంభంలో ఆశీస్సుగాని, నమస్సుగాని, కథాసూచనంగానీ ఉండాలని పెద్దల ఆదేశం. ఈ పద్యంలో నమస్కృతీ ఉంది, కథా విష్కృతీ ఉంది.

మహానందాంగనాడింభకుడు భాగవతకథానాయకుడు. అతని స్మరణం అంటే వస్తువరణమే కదా! ఇంతకూ, భాగవతాన్ని తెనిగించుమని ఆనతిచ్చినవాడు రామభద్రుడు. కాని, ఈ కృతి అందుకున్నవాడు నందనందనుడు. అందుకే పోతన్న ఆ నంద కుమారుని అనంతముఖ అవతార రహస్యాల్ని ఈ పద్యంలో పొందుపరచినాడు. 'లోకరక్షైకారంభకు' అనడంలో పర మాత్మని స్థితికరత్వాన్ని— "భక్తపాలన కళాసంరంభకు" అన డంలో గజేంద్రుని లాంటి ఆర్తులను ఆదుకునే గుణాన్ని — "దానవోద్రేక స్తంభకు" అనడంలో హిరణ్యకశిపుని వంటి రాక్షస ప్రవృత్తులను అణగార్చే పనితనాన్ని— "కేళిలోల విల సద్దృగ్జాలసంభూతనానాకంజాతభవాండకుంభకు" అనడంలో ప్రధా నంగా సృష్టిలీలను, కేళి శబ్దంచేత ఒకరకంగా కృష్ణలీలను ధ్వనింప జేసినాడు.

ఇంతటి మహార్థాన్ని ధ్వనింపజేస్తూనే పోతన్న తనకు వెన్నతో పెట్టిన పద్యవిద్యను మరువలేదు. "డింభకుణ్ణి" మనస్సులో అనుకున్నాడు. అందుకు అనుగుణంగా అమ్మల అందుకున్నాడు. "ఆరంభకున్" "సంరంభకున్" "స్తంభకున్" "కుంభకున్" అంటూ సమాసాంతంలో అంత్యప్రాసలు కూర్చే వింత విద్య ఇది. ఏమిటి దీని ప్రయోజనం? చెవికి చవులూరించే నాద సుఖం. బిందుపూర్వక భకారాన్ని పునరుక్తంచేసి మహత్తర నాదాన్ని పూరించినాడు పోతన్న. పదం–అర్థం పొందిన మధుర సమ్మేళనం ఈ పద్యం.

ఈ పద్యంలో పోతన్న ఆశిస్తున్నది ఏ కృతిభర్తకో విశ్వభర్త ఇచ్చే ఆశీస్సులు కాదు. అసలీ కృతికి ఏ నరపతీ కృతిపతి కాడు—శ్రియఃపతి తప్ప. అంతటి సిరిదొరను ఈ అమాయకుడు అర్థించిం దేమిటి? కేవలం కైవల్యం. శరీర ఇంద్రియ విముక్తమైన ఆత్మ కేవలమైనది. అది పొందే స్థితి కైవల్యం. ముముక్షువైన పోతన్న కాంక్షించేది కైవల్యమే. కాసులు కాదు.

2. పలికెడిది భాగవత మఁట!
పలికించు విభుండు రామభద్రుం డఁట! నేఁ
బలికిన భవహర మగునఁట!
పలికెద వేఱొండు గాథఁ బలుకఁగ నేలా?

ఏదైనా ఒక విష్ణుకథ వ్రాయాలని కుతూహలంతో ఉన్నాడు పోతన్న. అప్పుడు కలలాంటి మెలకువలో కట్టెదుట నిలిచినాడు రామన్న. భాగవతం తెలుగుచేస్తే భవబంధాలు తెగుతా యని ఆనతిచ్చినాడు. పోతన్నకు అనుకున్న వస్తువు దొరికింది. కథేమో మహాభాగవతం. ఫల మేమో భవబంధవిమోచనం.

విప్ఫారిన కనులతో వెరగుపడ్డ మనసుతో అనుకున్నాడు—పలికేది భాగవతమనీ, పలికించే శక్తి స్వీయం కాదు దివ్యమనీ, పలికితే కలిగే ఫలం తాను మొట్టమొదట ఆశించిన కైవల్య మని. ఇంతకు మించిన సాఫల్యం ఏముంది? ఇంతకు మించిన కథ మరేముంది?

పండి మగ్గిన వ్యాస భాగవత ఫలం పోతన్నవంటి తెలుగు చిలుకలకు లభించడం దైవనియోగం. ఆంధ్రరసికుల అదృష్ట యోగం!

౩. వేదకల్పవృక్షవిగళితమై శుక
ముఖసుధాద్రవమున మొనసియున్న
భాగవత పురాణ ఫలరసాస్వాదన
పదవిఁ గనుఁడు రసికభావవిదులు.

భాగవత పురాణం ఎలా అవతరించినదో, ఎలా వ్యాపించిందో సుమధుర రూపకంగా పొదిగి చూపిన పద్య మిది. భాగవతం ఒక ఫలం. అది వేద మనే కల్పవృక్షంనుంచి జారిపడింది. నేలమీద కాదు, శుకముఖంలో. ఆ సుధాద్రవంతో సురుచిరంగా భాసించే ఆ ఫలరసాన్ని ఆస్వాదించే పదవి రసికభావవిదులది. కావ్యాస్వాద నకు రసికత్వం భావుకత్వం అవశ్యగుణాలు. ఈ పురాణఫలం ఆ అధికారులకే నిర్దేశించబడింది.

పోతన కూర్చిన ఈ రూపకమాలికలో "శుకముఖం" అనే సమాసం శ్లేషావాసం శుకయోగితోపాటు చిలుక తళుకు లొలకడం ఈ పద్యంలో సరికొత్తరుచులు చిలకడం.

మూలభాగవత శ్లోకఫలాన్ని పరమవిధేయంగా తెలుగువారి కందించినాడు పోతన్న.

4. భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలి కైన!
విబుధజనులవలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపఱుతు.

రామాయణం, భారతం, భాగవతం – ఈ మూడు గ్రంథాలు భారతీయ సంస్కృతికి మూలబింబాలు. భారతీయుల కట్టూ, బొట్టూ, నడకా, నాణ్యం, ఆవేశం, ఆలోచన అన్నిటిపైన ఈ మూడుకావ్యాల ముద్ర ఉంది. ఈ మూడింటిలో రామాయణ భారతాలకంటె భాగవతం అర్థంచేసుకోవడం కష్టం. కారణం? ఇందులో భక్తిపథంతోపాటు అక్కడక్కడ అతిజటిలమైన వేదాంత ఘట్టా లుండడమే. శ్రీధరపండితుడు విడదీసిన చిక్కులను చూస్తేనే గాని ఒకపట్టాన ఇది అంతుపట్టదు. అందుకే పోతన్న విన్న వించుకున్నాడు–భాగవతాన్ని అర్థం చేసుకోవడం సులభంకాదని, తెలుసుకున్నదాన్ని తెలియజెప్పడం మాటలు కాదని. ఎవరికి? కవులకు మాత్రమే కాదు. ముగ్గురు మూర్తులలో అటు శివునికి ఇటు కమలభవునకీ కూడా, ఇక మధ్యలో మిగిలినవాడు మాధవుడు. భాగవతం ఆ మాధవుని కథే. ఆయన కథ తెలిసి పలకాలంటే ఆయనకే చెల్లుతుందేమో. ఆ భగవత్తత్త్వాన్ని తాను పండితుల వలన తెలుసుకున్నంత, తన దృష్టికి తెలియవచ్చినంత తేటపరుస్తా నని పోతన్న చెప్పుకున్నాడు. మిగతా విబుధజనులెవ్వరో తెలి యదుగాని వ్యాసభాగవతానికి వ్యాఖ్యానం వ్రాసిన శ్రీధరపండి తుణ్ణి మాత్రం పోతన్న ఆసరాగా తీసుకున్నాడు. వేదాంత ఘట్టాల వివరణలో శ్రీధరీయవ్యాఖ్య పోతన్న పాలిటి సువర్ణ భిక్ష.

5. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరముఁ బాసి కాలుచే
సమ్మెటపోటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.

విశ్వశ్రేయం కవితాలక్ష్యం. దానిని డబ్బుకోసమో, దాబు కోసమో, ధనికులకో, అధికులకో అమ్ముకోవడం ఆత్మవంచనం. ఇది ప్రాయికంగా ఆధునిక దృక్పథం. ప్రయోగగర్భితమైన ఈ దృక్పథాన్ని అలనాడే ఉద్ఘోషించినాడు బమ్మెర పోతరాజు. నరాంకితాన్ని నిరసించడం అప్పటికి అపూర్వమే కాదు. సాహసో పేతం కూడా. ప్రభుస్వామ్య వ్యవస్థలో ప్రజాస్వామ్య దృక్కో ణాన్ని ప్రదర్శించడం పోతరాజు స్వచ్ఛంద వ్యక్తిత్వానికి నిదర్శనం. మెత్త మెత్తగా కవిత్వం వ్రాయడానికి పేరుబడ్డ ఈ కవి సుత్తెతో కొట్టినట్టు "మనుజేశ్వరాధముల"ను నిరసించి నాడు. తాను నమ్మిన పరంధామునికే భాగవత కృతిని సమ ర్పించినాడు. ఆ సమర్పణంలో స్వార్థం లేదు. జగద్ధితమే—లోక హితమే దాని చరమార్థం.

పోతన్న అనగానే మొట్టమొదట గుర్తుకొచ్చే ఈ పద్యం అతనిది కాదనీ ఎవరో వ్రాసి చేర్చిందనే అభిప్రాయం కూడా లేక పోలేదు. వ్రాసిన దెవరైనా ఇందులో ప్రత్యక్షరంలో పోతన్న వ్యక్తిత్వమే సాక్షాత్కరిస్తున్నది.

6. కొందఱికిఁ దెనుఁగు గుణ మగుఁ
గొందఱికిని సంస్కృతంబు గుణ మగు రెండున్
గొందఱికి గుణము లగు నే
నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యై యెడలన్.

నన్నయ మొదలుకొని ప్రాచీనాంధ్రకవులందరూ సంజా యిషీ ఇచ్చుకున్నారు. తాము తెలుగు-సంస్కృతం ఈ రెండు భాషల్లో సమర్థంగా కవిత అల్లగలుగుతా మని. ఎందుకు? అప్ప టికి కావ్యమంటే సంస్కృతకావ్యమే, పాండిత్య మంటే సంస్కృత పాండిత్యమే.

అయినా, తెలుగులో కవిత్వాన్ని వెలయించా లని రాజ రాజులాంటి పోషకులకూ, నన్నయలాంటి సాధకులకూ అపారమైన కోరిక. నన్నయ అన్నాడు - తాను "ఉభయభాషాకావ్యరచనాభి శోభితుడ" నని. తిక్కన చాటుకున్నాడు — తన "ఉభయకావ్య ప్రౌఢి"ని. ఈ పోతన్నకూడా విన్నవించుకొన్నాడు. "ఉభయ కావ్యకరణదక్షుడ" నని.

అయితే కొందరికి తెలుగు ఇష్టం. కొందరికి సంస్కృతం ఇష్టం. "నేను అందరినీ మెప్పిస్తాను" అని సమర్థించుకోవడ మెందుకు? అప్పటికే పాలకురికి సోమనాథుడు "నావి తెలుగు మాటలు కావు వేదాలు" అని తాండవిస్తున్నాడు. "సంస్కృత భూయిష్ఠరచన" అందరికి అందుబాటులో ఉండదని హుంకరిస్తు న్నాడు. ఇంకొకవైపు శ్రీనాథుడు తెలుగూ కాదు, సంస్కృతమూ కాదు. "నా కవిత్వంబు నిజము కర్ణాటభాష" అని తన దారిని తాను నడుస్తున్నాడు. ఇంతకూ శ్రీనాథుడన్నది నిజమే. అయితే అతని భాష కర్ణాటభాషా? కాదు. తన కవిత్వం కర్ణాట భాష అన్నాడు. అంటే కన్నడం లోని కవితారీతులనూ — సంస్కృత సమాసధోరణులనూ — దేశిపదప్రయోగవైఖరులనూ తనలో ఇమిడించుకున్న కవిత్వం అని అతని అభిప్రాయమేమో!

ఎవ్వరేమనుకున్నా నాకేమి కొరత-అని ఈసడించే మన స్తత్త్వం కాదు పోతన్నది. లోకంలో భిన్నరుచు లున్నాయి. కవితాలోకంలో ఎన్నెన్నో తెన్నులున్నాయి. నన్నయ మార్గరీతి ఉంది. సోమన్న దేశిరీతి ఉంది. ఈ రెంటికి అనుయాయు లున్నారు. ఆ రెండు గుణాలను తనలో మేళవించుకున్న కావ్య శిల్పి పోతన్న.

ఈ పద్యంలో పోతన్న వినయమే కాదు; ఆత్మవిశ్వాసమూ ధ్వనిస్తున్నది.

7. మందారమకరందమాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే? మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు
రాయంచ సనునె? తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు
కోయిల సేరునే? కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక
మరుగునే? సాంద్రనీహారములకు
అంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ జేర నేర్చు?
వినుతగుణశీల! మాటలు వేయునేల?

సంస్కారాన్నిబట్టి మనసు. మనసునుబట్టి మార్గం. ఆ మనో గతిని మళ్లించడం ఎవరికి సాధ్యం? భగవంతుని పాదాలను భజించడంలో మత్తెక్కిన చిత్తానికి మరో చింత ఉంటుందా? ఉండదు. ఆ ఉండదనే సత్యాన్ని నాలుగు రకాలుగా బహుముఖా లుగా చెప్పితేనేగాని పోతన్న మనసు నిండదు.

ఒక విషయాన్ని తీసుకుని అలంకారబలంతో వాక్యనిర్మాణ కౌశలంతో నొక్కి నొక్కి చెప్పడం పోతన్నకు ఒంటపట్టిన గుణం. ఇది పాలకురికి సోమన్నలో ఉంది. ఆ పరిసరాలలో పుట్టిన బమ్మెర పోతనలోనూ ఉంది. ఇది వక్తృత్వశైలి (Rhetoric Style). ఒక వక్త వేదికపై నిలిచి ఉద్ఘాటించే ధోరణి.

మందార మకరందాల తీపి మరగిన తుమ్మెద ఉమ్మెత్త పూలను చేరుకుంటుందా? ఆకాశగంగాతరంగాలలో ఉయ్యాల లూగే రాజహంస వాగులకూ వంకలకూ చేరుతుందా? తియ్యని మామిడి లేత చిగుళ్ళను తిని పరవశించే కోయిల కొండమల్లె [illegible]

కోరుకుంటుందా? పండు వెన్నెల బయళ్ళలో విహరించే చకోరం మంచుపొగలవైపు పోతుందా? లేదు, లేదు. వీలు కాదు. వేయి మాట లెందుకు? పరమాత్ముని వలచిన మనసు మరో వైపు చేరుకోదు.

ఈ పద్యం భక్తికి పట్టుగొమ్మగా నిలిచింది. పోతన్న రచనాశక్తికి నిలువుటద్దంగా నిలిచింది. నిజాని కిది —

"క్షీరాబ్ధిలోపలఁ గ్రీడించు హంస,
గోరునే పడియల నీరు ద్రావంగ"

అనే పాలకురికి సోమన్న పద్యప్రభావంతో పుట్టిందే. అయినా ఈ పద్యం పొందిన ప్రచారం అపారం. ఈ పద్యంలో కనీసం మొదటిపాదం రాని తెలుగువాడు దాదాపుగా లేనేలేడు. ఒకవేళ ఉంటే వాడు తెలుగువాడు కానేకాడు. ఇంతటి వశీకరణశక్తికి మూలకారణం మధురాక్షరసమ్మేళనం— "మందార," "మధుప", "మదనములు", ఒక్క పాదంలోనే ఇన్ని మకారాల గుబాళింపు అందుకే ఈ పద్యం తెలుగువారి నోటి కెక్కింది.

ఈ ఒరవడిలో పోతన్న ఎన్నెన్నో పద్యాలను తీర్చిదిద్దుకున్నాడు.

"కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ"
"కంజాక్షునకు గాని కాయంబు కాయమే
పవనగుంభిత చర్మభస్త్రి గాక"
"సంసారజీమూతసంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభంజనము లేక"

ఉ. కమనీయభూమిభాగములు లేకున్నవే?
　　　పడియుండుటకు దూదిపరుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే?
　　　భోజనభాజనపుంజ మేల?
వల్కలాజినకుశాదులు లేకున్నవే?
　　　కట్ట దుకూలసంఘాత మేల?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే?
　　　ప్రాసాదసౌధాదిపటల మేల?
ఫలరసాదులు గురియవే? పాదపములు
స్వాదుజలముల నుండవే? సకలనదులుఁ
బొసఁగ భిక్షయుఁ బెట్టరే? పుణ్యసతులు
ధనమదాంధుల కొలు వేల? తాపసులకు.

ప్రాయోపవేశంలో ఉన్న పరీక్షితునికి శుక యోగి భక్తి జ్ఞానమార్గాలను ఉపదేశిస్తున్నాడు. సంసారం మనం తెచ్చి పెట్టుకున్నది: కృత్రిమమైనది: ప్రకృతి స్వతస్సిద్ధమైనది. సహజ సౌఖ్యదాయక మైనది. నిలువడానికి నేల నిస్తుంది. కట్టుకోవడానికి నారచీర లిస్తుంది. నివసించడానికి గుహలను చూపుతుంది. తిని త్రాగి, జీవించడానికి ఫలాలను జలాలనూ అందిస్తుంది.

మరి సంసారవలయం ఏం చేస్తుంది? దూదిపరుపులను, పసిడి పాత్రలను, జిలుగు వలువలను, తళుకు మేడలను ఎరచూపుతుంది. రెంటికీ ఎంత వ్యత్యాసముంది?

తాపసి—అంటే యోగి. ఈ వ్యత్యాసాన్ని అవగతం చేసుకుంటాడు. సంసార వలయంలో బుసకొట్టే సంపన్నుల కొలువు తన కెందుకని నిర్ణయించు కుంటాడు. పుణ్యసతులు పెట్టే భిక్షానుభవంతోనే ధన్యతను గణించుకుంటాడు. యోగుల అంతఃకరణానికి ప్రతిబింబం ఈ పద్యం.

నిరాడంబరజీవితానికి పోతన్న ప్రతినిధి అని తెలుగునాట తరతరాలుగా ప్రచారంలో ఉన్న అభిప్రాయానికి ఈ పద్యం ఒకరకంగా అంతస్సాక్ష్యం కూడా.

9. చేతులారంగ శివునిఁ బూజింపఁ డేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁ డేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁ డేనిఁ
గలుగ నేటికిఁ దల్లుల కడుపు చేటు.

శివుని పూజించడం, హరిని కీర్తించడం, దయనూ సత్యాన్నీ ధర్మాలుగా భావించడం జన్మసాఫల్యానికి సాధనాలని పోతన్న విశ్వాసం. ఇవి లేనివాని జీవితం వ్యర్థం. వ్యర్థుణ్ణి ఈసడించడానికి "వాడు తల్లికడుపు చెడబుట్టినా'' డని నేటికీ వాడుతుంటాం. ఇది నాటివాడుక కూడా. "కడుపుచేటు" అన్న నుడికారం పాఠకుల గుండెల్లో సూటిగా దూసుకుపోయే రామబాణం.

శివకేశవుల అద్వైతాన్ని వ్యంగ్యంగా ప్రతిపాదించడం ఈ పద్యంలోని మరొక విశేషం.

10. ఒక సూర్యుండు సమస్తజీవులకుఁ దానొక్కొక్కఁడై తోచుఁ బో
లిక నే దేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచు నుండు నట్టి హరి నేఁ బ్రార్థింతు శుద్ధుండనై.

సూర్యుడొక్కడు: జీవులు పెక్కురు. ఆ ఒక్క సూర్యుడే ప్రతిజీవికి ఒక్కొక్కడుగా కనిపిస్తాడు. భగవంతు డొక్కడే: అతణ్ణి భావించే హృదయాలు అనేకాలు. ప్రతిహృదయానికి ఒక పరమాత్ముడు భాసిస్తాడు. సూర్యుడు కనిపించడం స్థూలదృష్టి. భగవంతుడు భాసించడం సూక్ష్మదృష్టి. తాత్త్విక విషయాన్ని అరటి పండొలిచినట్టు బోధించినపద్య మిది.

11. త్రిజగన్మోహననీలకాంతి తను వుద్దీపింపఁ బ్రాభాత నీ
రజబంధు ప్రభమైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్త ముఖారవింద మతిసేవ్యం బై విజృంభింప మా
విజయుం జేరెడు వన్నెకాఁడు మది నావేశించు నెల్లప్పుడున్.

భీష్ముని హృదయపటంలో చిత్రిత మైన శ్రీకృష్ణుని వర్ణ చిత్ర మిది. ఈ కృష్ణుడు విజయసఖుడు. నీలాకాశమే తనువుగా, భానుప్రకాశమే పీతాంబరంగా ఉద్భాసించే విశ్వమూర్తి తన మనసు ఎల్లప్పుడూ ఆవేశించాలని ఆ పితామహుని ఆశయం.

ఈ పద్యానికి వన్నె తెచ్చిన ప్రయోగం శ్రీకృష్ణణ్ణి "వన్నె కాడు" అన్న తెలుగుపదం. పైన "త్రిజగన్మోహననీలకాంతి", "ప్రాభాతనీరజబంధుప్రభము" "నీలాలకవ్రజసంయుక్త ముఖారవిందం" వంటి సులలితసంస్కృతసమాసాలతో తరగెత్తిన పద్యంలో "వన్నెకాడు" అన్న ఆ చిన్నమాట పైకి తేలిన నురుగు పువ్వు.

12. మన సారథి, మన సచివుఁడు
మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుఁడున్
మన విభుఁడు, గురువు, దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా!

ద్వారకనుంచి తిరిగివచ్చిన అర్జునుడు పెన్నిధిని కోల్పోయిన పేదవలె నిట్టూరుస్తూ అన్నతో అన్న పద్యమిది. కృష్ణుడు పాండవులను నడిపించిన వాడు. ఉపాయాలు ఉపదేశించిన వాడు. వియ్య మందుకున్న వాడు. నేస్తం నెరపిన వాడు. చుట్టరికం కలసిన వాడు. పైగా వారికి గురుడు. అన్నింటినీ మించి దేవుని లాంటి వాడు. అంతటి ఆత్మహితుడు అస్తమించిన వార్తను ఎంతో కరుణావిలంగా అందించిన పద్య మిది.

అయితే కాలం గడిచినకొద్దీ ఈ పద్యం వేనోళ్ళతో వికసించింది. కృష్ణ పాండవుల పరిధిని దాటి సమస్త మానవుల దైనందినవ్యవహారంలోకి ప్రవేశించింది. మిత్రుడో, ఆప్తుడో, బంధువో, ఒక సంఘ సేవకుడో, ఒక దేశనాయకుడో పరమపదించినపుడు అప్రయత్నంగా ఈ పద్యం తెలుగువాని గుండెలో మెదులుతుంది. కొండంత దుఃఖానికి అద్దంపట్టి చూపుతుంది.

ఒక చిన్నకందంలో ఎన్నెన్ని బంధాలను ముడివేసినాడు పోతన్న! అందుకే తెలుగన్నల నాల్కలపై కలకాలం నిలిచిపోతుంది.

13. ఎవ్వనిచే జనించు జగ
మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బర
మేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ
డెవ్వఁడు సర్వముఁ దాన యైన వాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు
నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

మకరినోట చిక్కిన కరిరాజు సొంతకాళ్ళపై నిలబడి వెయ్యేళ్ళు పోరాడినాడు. చివరికి నీరసించినాడు. నిట్టూర్చినాడు. ఏ దిక్కూ తోచక దిక్కులకే దిక్కైన సర్వేశ్వరుణ్ణి శరణు వేడినాడు.

ఆ సర్వేశ్వరుని మూలతత్త్వం ఈ పద్యంలో ఎన్నో దశాలతో విప్పారింది. ఇందులోని "ఎవ్వడు" అవ్యక్తుడు. ఆ అవ్యక్త రూపుణ్ణి వ్యక్తపరచడానికి "ఎవ్వడు" అనే మాట ఎన్నో విభక్తులతో రూపుదిద్దుకుంది. అదే ఈ పద్యంలోని విశిష్టత.

14. లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగిన తుది సలోకం బగు పెం
జీఁకటి కవ్వల నెవ్వఁడు
నేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్.

పగలు వెలుగు. రాత్రి చీకటి. ఇదే నిత్యనైమిత్తిక భ్రాంతి. సృష్టి మొత్తం చీకటి. లోకాలు, లోకులు, లోకేశ్వరులు. ఆ పెను చీకటికి మారురూపులు. ఉన్నది ఒకే ఒక్క పరంజ్యోతి. అది ఒక్కటే అనశ్వరమైన ఆకృతి. ఆ వెలుగే తనకు శరణ్యమని గజేంద్రుని దృఢసంకల్పం.

15. కలఁ డందురు దీనుల యెడఁ
గలఁ డందురు పరమయోగిగణముల పాలం
గలఁ డందు రన్ని దిశలను
గలఁడు కలం డనెడువాఁడు కలఁడో లేఁడో.

గజేంద్రుడు ప్రస్తుతం ఆర్తుడు. ఆర్తిలో అచ్చమైన సత్యమూర్తి పొగలు పొగలుగా పొరలుపొరలుగా కనిపిస్తుంది. భగవంతుడు అంతటా ఉన్నాడని అంటారు. అలా అనగా ఇతడు విన్నాడు. త్రికరణశుద్ధిగా నమ్మి ఉన్నాడు. అయినా అప్పటి జంజాటంలో ఆ జీవిబుద్ధిని సంశయం కమ్ముకుంది. 'కలడు కలం డనెడువాడు కలడో లేడో' అని గుంజు కున్నాడు ముడులు విడని ఆ సంశయాత్ముడు. ఈ సంశయాత్ముడు ఇలా సతమత మవుతూ వుంటే ఆ నిశ్చయాత్ముడు ప్రహ్లాదుడు సర్వేశ్వరుని ఉనికి విషయంలో "సందేహము వల" దని చాటిచెప్పినాడు. ఇదీ ఈ ఇద్దరిమధ్యలో ఉన్న తేడా.

ఒక్క గజేంద్రుడే కాదు. ఈ లోకంలోని కోటానకోట్ల జీవులు అప్పుడూ ఇప్పుడూ ఈ పెనుగులాటతోనే సతమత మవు

తున్నారు – పరమాత్ముని అస్తిత్వాన్ని నిరాకరించలేక. నిశ్చయించలేక.

పరమ గంభీరమైన ఈ బ్రహ్మజిజ్ఞాసను చిన్న చిన్నమాటలతో ఎత్తిచూపి, పామరులకుకూడా పరమాత్మతత్త్వాన్ని అందజేసినాడు పోతన్న.

16. లా వొక్కింతయు లేదు, ధైర్యము
విలోలం బయ్యెఁ, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చెఁ,
దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్.
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ,
మన్నింపం దగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద
సంరక్షించు భద్రాత్మకా!

గజేంద్రుడు అనేక గజసమూహాలకు అధిపతి. దశలక్షకరిణీగణానికి పతి. ఉద్దామవైభవంతో విశృంఖలంగా విహరించే ఆ కరివరుడు విధివశాన మకరినోట చిక్కువడినాడు. హోరాహోరిగా అహోరాత్రులు పోరాడినాడు. మకరిని గెలుస్తానన్న అహం సన్నగిల్లింది. స్వశక్తిపైని విశ్వాసం సడలిపోయింది. లోకేశ్వరుని వైపు చూపు మళ్ళింది.

ఒక దశలో అత డున్నాడో లేడో అను అనుమానం పొడసూపింది. "సంశయాత్మా వినశ్యతి." అయితే ఈ భక్తుడు ఆ కోవకు చెందినవాడు కాడు. వెంటనే తేరుకున్నాడు. సందేహాంధకారంనుంచి మేలుకున్నాడు. శరణమే తరణోపాయ మని నిర్ణయించుకున్నాడు. అతని అశక్తిని నివేదించుకున్నాడు. "నీవే తప్ప నితఃపరం బెరుగ" (త్వమేవ శరణం మమ) నని తనను

తానే అర్పించుకున్నాడు. భగవదనుగ్రహానికి శరణాగతి తప్ప మరొక మార్గం లేదని నిశ్చయించుకున్నాడు. ఫలితం? పరమాత్మ సాక్షాత్కారం: మొసలికోరలవంటి భవబంధాలనుంచి విమోచనం.

ఈ పద్యంకూడా తెలుగువాళ్లు అనేక సందర్భాల్లో సందర్భోచితంగానూ, సందర్భరహితంగానూ వాడుకుంటున్నదే. "నీవే తప్ప నితఃపరం బెరుగ" అని పరమలౌకిక ప్రయోజనాలకు కూడా ఉపయోగిస్తుంటారు – కొలిచే పెత్తందారు పట్లనే కాదు, వలచే ప్రియురాలిపట్ల కూడా. ఇక ఏ దిక్కూ లేనప్పుడు "లావొక్కింతయులే" దని తెలుగువాని నాలుక విలవిలలాడక తప్పదు. అంతేకాదు. అరాజక స్థితి చెలరేగే సమకాలీన సమాజాన్ని చూస్తే కొందరికి 'Law ఒక్కింతయులే' దని అనిపించక పోదు.

17. అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు దా
పల మందారవనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము'పాహి పాహి' యనఁగుయ్యాలించిసంరంభియై.

గజేంద్రుడు మొరపెట్టుకునే సమయంలో ఆ దేవదేవుడు ఏ స్థితిలో ఉన్నాడో వర్ణించడం ఈ పద్యంలోని చిత్రం. ఒక మాటలో చెప్పాలంటే ఆ మహావిష్ణువు అప్పుడు రమాసాంగత్యంలో తేలియాడుతున్నాడు.

కాని, మూడు ముక్కల్లో ముడిచి చెప్పడం పోతన్న పద్ధతి కాదు. రసకేళీ పరవశుడైన ఆ రమాధవుని స్థితికి ఒక చలన చిత్రాన్ని రూపొందించినాడు: కనులముందు అతనికి కదలాడేటట్టు చూపినాడు.

అల వైకుంఠపురం: ఆ పురంలో అంతఃపురం: అందులో ప్రధానసౌధ సమీపంలో అమృతసరోవరం: అక్కడ చంద్రకాంత

వేదికపై కలువల పాన్పు: ఆ పాన్పుపై క్రీడిస్తున్న నారాయ ణుడు.— ఇదీ పోతన్న కట్టిన చిత్రతోరణం.

ఇంత వివరంగా ఎందుకు చిత్రించినట్లు? ఎవరు మొ పెట్టినా ఎంతగా తలుపులు తట్టినా లెక్కించని స్థితి అది. ఎక్కడ గజేంద్రుడు ఆక్రందిస్తుంటే ఇక్కడ ఇంతటి రసపారవశ్యంల ఉన్న స్వామి సంరంభించడం సామాన్యం కాదు. జీవాత్మ ప మాత్మల మధ్య ఉన్న అంతు లేని అఖాతాన్ని. అపార వ్యత్యా సాన్ని ఎంతో మెలకువతో చిత్రించినాడు. ఆతడు రమావినోద యైనా ఆర్తుని మొర విని పరుగెత్తడానికి కారణం ఒక్కమాటలో సూచించినాడు కవి. అదే "అపన్నప్రసన్నుండు'' అనేది. ఎక్క డున్నా జనార్దనుడు ఆర్తత్రాణపరాయణుడే. గజేంద్రుడున్న కరుణావస్థకు. ఉపేంద్రుడున్న శృంగారరసస్థితికి మధ్య ఆర్తి ఒక సేతువైంది.

అదే ఈ పద్యంలోని కొసమెరుపు.

18. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ, డభ్రగపతిం బన్నింపఁ, డాకర్ణికాం
తరధమ్మిల్లము చక్క నొత్తఁడు, వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహి యై.

శ్రీమన్నారాయణుడు స్థితికారుడు. స్థితి శిష్టరక్షణలో ఉంది. అందుకే ఆ మహాప్రభువు అంతగా సంరంభించినాడు. అర్ధాంగితో నైనా ఆ మాట చెప్పలేదు. పోనీ....సమరసామగ్రినైన సమకూర్చు కోలేదు. గబుక్కున వెళ్ళాలంటే గరుడవాహనం అవసరం కదా! అదీ అవసరం అనిపించలేదు ఆ ఆపన్న ప్రసన్నునికి. ఇంతకూ సాధురక్షణకు సాధనాలతో నిమిత్త మేమి? భర్తృపోషణకు పరి వారంతో అవసర మేముంది? నిజమే. ఆ విశ్వపతికి ఇవేవీ అక్కర

లేదు. నిస్సహాయుడుగా నిరాయుధుడుగా దుష్టసంహారం చేయ గలుగుతాడు. కాని, ఉన్న చిక్కంతా అతని చేతిలోనే ఉంది:— ఆ చేతికి చిక్కువడిన చేలాంచలంలో ఉంది. తనకు చెప్పకుండా ఆయన వెళ్ళిపోయినా ఆ యమ్మ కాదనలేదు. కాని, ఆయున చేతిలో ఉన్న తన చేలంచెరగు మాటేమిటి? "ఇదేమిటి'' అని అడిగితే వినే స్థితిలో ఉన్నాడా ఆ వెర్రి నాయన! మరి అడగకుండా తా నెలా ఉండగలుగుతుం దంటారు?....

19. అడిగెద నని కడువడిఁ జను;
నడిగిన దను మగుడ నుడువఁడని నడ యుడుగున్;
వెడవెడ సిడిముడి తడఁబడ
నడుఁగిడు నడుఁ గిడదు జడిమ నడుఁగిడు నెడలన్.

"అడగాలా వద్దా?" అనే తడబాటును సూచించే పద్య మిది. అప్పటి ఆందోళనకు తగ్గ అక్షరాల పోహళింపు ఈ పద్యం లోని సొంపు. దీన్ని సర్వ లఘుకంద మంటారు. ఇందులో అన్నీ లఘువులే. సర్వలఘువుల సంతరింపు భావోద్వేగానికి ముక్తాయింపు.

అంతమాత్రానసే ఈ పద్యం అందగించలేదు. సుడులనడ కలో "డ'' కారం పదే పదే సవ్వడించడం ఈ పద్యంలోని మేలి గుణం. తెలుగుభాష తెలియని వానికి కూడా ఈ పద్యం వింటే డకార పునరుక్తి చెవికి తగిలి ఏదో హడావిడీ, గడబిడ ఉన్నట్లు స్ఫురించక మానదు.

ఒకే అక్షరాన్ని తిరిగి తిరిగి ప్రయోగించి ఉద్దిష్టభావానికి ఊత సాధించడం ఈ పద్యంలో పోతన్న చేసిన గారడీతనం.

20. గొడుగో, జన్నిదమో, కమండలువో నా
కున్ ముంజియో, దండమో,
వడుగే నెక్కడ భూము లెక్కడ? కరుల్
వామాక్షు లశ్వంబు లె
క్కడ? నిత్యోచితకర్మ మెక్కడ? మదా
కాంక్షామితం బైన మూఁ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటయె బ్ర
హ్మాండంబు నాపాలికిన్.

అడిగేవాడు వామనమూర్తి. ఇచ్చేవాడు బలిచక్రవర్తి. ఒకటి రెండడుగుల నేల ఇమ్మని ఆ వడుగు అడుగగా బలి అంటాడు— "పసివాడా! నీకు అడగడంకూడా చేతకాదు. పోనీ. నీకు చేతకాకుంటే దాత పెంపుసొంపులను తలపవద్దా? వసుధా ఖండమో, గజములో, గజగమనలో కావాలని అడగాలె కాని ముష్టి మూడడుగులు అడగడ మేమిటి?" అని. అప్పుడు చిరునవ్వు చిప్పిలగా ఆ గృహమేధికి ఈ మేధావి బదులుపల్కిన పద్య మిది.

కరులూ, హరులూ, సిరులూ సుందరులూ సంసారులకు. తానో బ్రహ్మచారి. తాను కోరేది గొడుగో జన్నిదమో కమండలువో యోగదండమో. ఆ మూడడుగులే తన పాలిటి బ్రహ్మాండం మరి! మూడడుగుల్లో ముల్లోకాలను ముడివేసిన గడుసుదనం ఆ మాయానటునిది.

వామనుని త్రివిక్రమత్వాన్ని సుతారంగా స్ఫురింపజేసే వస్తుధ్వని ఈ పద్యంలో ఉంది.

21. వారిజాక్షులందు, వైవాహికములందుఁ,
బ్రాణవిత్తమానభంగమందుఁ,
జకితగోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము పొంద దధిప!

'జీవాత్మకు అనృతమే మూలం' అనేది శుక్రనీతికి మూలం. దాని విస్తరణమే ఈ పద్యం. ఏ మాత్రం బొంకవలసివచ్చినా 'వారిజాక్షులందు వైవాహికములందు' అంటూ సమర్థించుకోవడం సర్వసామాన్యంగా చూస్తున్నాం. ఏ వేళ ఏ లీల ఆచార్య శుక్రుడు ఉపదేశించినాడో కాని ఇది తెలుగునేల ఇప్పటికీ అబద్ధాలాడడానికి ఆధారంగా నిలిచిపోయింది. బొంకవలసిన సందర్భాలను చూస్తే, వాటిని మినహాయిస్తే, ఇక అబద్ధాలాడవలసిన అవసరం ఎవరికి ఉండదు. అదే శుక్రనీతిలోని చమత్కృతి.

22. కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపైఁ
బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!

బలిచక్రవర్తి యశస్వి. రాక్షసరాజైనా సత్యమూర్తి. తనువు నశ్వరతను, సిరుల అస్థిరతను ఎరిగిన జ్ఞాని. అందుకే శుక్రాచార్యుల వక్రనీతికి సూటిగా బదులు చెప్పగలిగినాడు. "పలికి బొంకడం కంటె పాపం లే"దన్నాడు. ఎందరెందరో రాజులున్నారు. ఎన్నెన్నో రాజ్యా లేలినారు. ఉన్నంతకాలం మిడిసి పడ్డారు. ఏమైంది చివరికి? పోయేటప్పుడు కూడబెట్టుకున్న సిరి మూటగట్టుకొని పోలేదు. భూమిపై వారిపేరైనా మిగులలేదు. కాని శిబిచక్రవర్తిలాంటి కొందరు ధర్మజ్ఞు లున్నారు. వారు అన్యులకొరకు ఆత్మార్పణం చేసుకొన్నవారు. అన్ని కాలాలకూ చెన్ను చెదరని కీర్తి వారిది. వారు నడచిన పుణ్యపథమే తనది.

ఈ పద్యానికి ఎనలేని సొగసు ఎత్తుగడ. రాజు లుండిరి రాజ్యము లేలిరి— అన్నధోరణిలో ఎత్తుకుంటే ఈ పద్యానికి కింత బిగువు వచ్చేదికాదు. ఒట్టి వచనంలో వట్టిపోయేది. 'కారే రాజులు' అని క్రియతో ప్రారంభించడం వాక్యవక్రత. వక్రతలోనే కదా

కవిత్వం తొంగిచూసేది! అందుకే ఈ పద్యం పదుగురికి పట్టు వడింది.

'కారే', 'వారేరీ', 'పేరైనన్' అంటూ ప్రాసస్థానంలో జంగ సాచి సాగిపోయిన మూడుముక్తాయింపులవల్ల ఈ పద్యం మరింత హృద్యంగా తయారైంది. ఈ పద్యంలో మిగతామాటల్ని మరచి పోయినా ఈ మూడుమాటలు విధిగా గుర్తుంటాయి. ఈ గుర్తే పోతన్నకీర్తికి మూలరహస్యం.

"సిరిమూట గట్టుకొనిపోవడం" తరతరాలుగా మిగిలి పోయిన నుడికారం. అప్పటికి వాడుకలో ఉన్న పలుకుబడి ఇది. నాడు వాడుకలో ఉన్నమాట పోతన్నకృతి కెక్కిందో, పోతన్న వాడడంవల్ల ఈ నుడికారం నేటివ్యవహారంలో వాసి కెక్కిందో!.... ఏమో మరి!

23. ఇంతింతై వటుఁ డింతయై మఱియు దానింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై.

24. రవిబింబం బుపమింపఁ బాత్రమగు-ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణకేయూరమై,
ఛవిమత్కంకణమై కటిస్థలి సుచంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్నిండుచోన్.

ఒకే పొదులో పుట్టినవి ఈ రెండుపద్యాలు. ఈ రెంటిలోనూ వామనమూర్తి ధరిస్తున్న విశ్వరూపమే వర్ణించబడింది.

మొదటి పద్యంలో గగనవీథి మొదలుకొని సత్యలోకందాకా ఆ పొట్టివడుగు పొందిన విరాడ్రూపం చిత్రించబడింది. వటుడు

ఆకాశాన్ని, మబ్బులను సూర్యచంద్రులను, ధ్రువుణ్ణి, మహర్లోకాన్ని క్రమక్రమంగా దాటిపోతున్నాడు. ఈక్రమాన్ని చెప్పడంలో అద్భుతత్వం ప్రధానతత్త్వం, అందుకు సరిపడే తెలుగునుడులను అందుకున్నాడు పోతన్న. 'ఇంతై', 'అంతై', 'ఇంతై', 'అంతై', 'అంతై', 'అంతై',—అన్న అచ్చతెలుగు పరిమాణవాచకాలను కొలమానాలుగా స్వీకరించి ఆ బ్రహ్మాండాంతసంవర్ధకుని స్వరూపాన్ని సమర్థంగా వర్ణించినాడు. కానీ, ఈ వర్ణన చదువుతూ ఉంటే సామాన్య పాఠకునికి మతి చెదిరిపోతుంది. ఎక్కడ నభో వీథి? ఎక్కడి ధ్రువలోకం? ఎక్కడి మహర్లోకం? ఎక్కడి బ్రహ్మ పదం? చిక్కులో పడిపోతాడు జిజ్ఞాసువు. తలనిండా ఆ త్రివిక్రమావతారమే ప్రళయభీలంగా ఆక్రమించుకుంటుంది. బుర్రలో బొమ్మ నిలువదు. అందుకే అందుకున్నాడు రెండో పద్యం.

నిదానంగా, దృశ్యచిత్ర ప్రధానంగా త్రివిక్రమాకృతిని తీర్చిదిద్దినాడు. ఇప్పుడు చూడండి! అంచె లంచెలుగా భిన్నాభిన్నావస్థల్లో పెంపొందిన క్రమవర్ధనం....

అదుగో!.... అంబరాలను దాటి ఎదిగిపోతున్నాడు వామనుడు, అతనికి గొడుగుగా నిలిచిన సూర్యుడు, మరీ మరీ పెరుగుతున్నాడు. అదే సూర్యబింబం భాసించింది—శిరోమణిగా, కర్ణభూషణంగా, కరకంకణంగా, మేఖలాఘంటికగా, చరణనూపురంగా, చివరికి పదపీఠికగా.

ఈ పద్యంలో చెప్పదలుచుకున్నది వామనుని క్రమపరిణామం. అందుకు సూర్యబింబం ఒక ప్రమాణం. ఆ ప్రమాణం స్థిరంగా నిలచి ఉంది. ఈ పరిణామం అనుక్షణం ఊర్ధ్వముఖంగా వర్ధిల్లుతూ ఉంది. వామనుని వ్యాపకత్వం ఒక్కమాటు జరిగింది కాదు, అవస్థాభేదంతో అతిశయించిన ఆకృతి అది. ఆ రూపానికి

పోతన్న కట్టిన బొమ్మలు చలనశీలాలూ చైతన్యమూలకాలూ. ముందటి పద్యంతో మతిచెదిరిన పాఠకుడు ఈ పద్యంతో తేరుకుంటాడు. బ్రహ్మాండమైన ఒక దివ్యరూపాన్ని కనులముందు నిలుపుకుంటాడు.

ఈ ఉల్లేఖం మూలభాగవతంలో లేదు. ఇవి వ్యాసుడు గీసిన బొమ్మలు కావు. పోతన్న కవితాత్మలో మెదిలిన సువర్ణ చిత్రచ్ఛవులు.

'ఇంతింతై వటు డింతయై' అన్నప్పుడు నాటి వటుని త్రివిక్రమత్వమే కాదు, నేటి ఒక సామాన్యుని అసామాన్యవృద్ధి కూడా స్ఫురిస్తుంది. 'అబ్బో! ఏమి చెప్పమంటారు? మా వాడు 'ఇంతింతై వటుడింతయై' అన్నట్లుగా పెరిగి పోతున్నాడు' — అని లోకవ్యవహారంలో వినిపిస్తున్నది.

ఈ విధంగా పద్యపాదాలు నానుడులుగా మారిపోవడం ప్రజాకవిగా పోతన్న పొందిన ప్రత్యేక స్థానానికి నిదర్శనం.

25. ఊరక రారు మహాత్ములు;
వా రధముల యిండ్లకడకు వచ్చుట లెల్లం
గారణము మంగళములకు;
నీ రాక శుభంబు మాకు; నిజము మహాత్మా!

వసుదేవుడు తన పురోహితుడైన గర్గుణ్ణి వ్రేపల్లెకు పంపిస్తాడు, నంద నందనుని కుశలము తెలుసుకొని రమ్మని. అతనికి సముచిత సత్కారములు చేసి నందు డన్న మాటలివి.

'పెద్దలు ఊరకరారు. వారు సామాన్యుల ఇండ్లకు రావడం సర్వశుభాలకు కారణం.'

ఇంతే. ఈ పద్యంలో మరే విశేషమూ లేదు. అయితే ఈ పద్యం ఎందుకు ఎన్నికైనట్టు? 'ఊరక రారు మహాత్ములు' అనే మొదటిపాదం ఒక లోకోక్తిగా మారడంవల్ల. చిత్ర మేమిటంటే:— ఇది పోతన్న పద్యపాదమని చాలా మందికి తెలియక పోవడం. ఇంకొక చిత్ర మేమిటంటే ఇది ఆ నందుడు పరమభక్తియుతంగా ప్రయోగించిన అర్థం సగం మరుగున పడి కాస్త వెటకారాన్ని తనలో కలుపుకోవడం. ఏమైతే నేమి? ఈ లోకోక్తి మన తెలుగు పలుకుబళ్ళతో పాటు పచ్చగా నేటికీ జీవిస్తున్నది.

26. చదివించిరి నను గురువులు;
చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు; నేఁ
జదివినవి గలవు పెక్కులు;
చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ.

మోక్షవిద్య తప్ప తన కొడుకు అన్ని విద్యలు చదవాలని హిరణ్యకశిపుని ఆకాంక్ష. మోక్షాన్ని గూర్చి బోధించే చదువే చదువని ప్రహ్లాదుని ప్రగాఢ విశ్వాసం. ఈ సంగతి అప్పటికి తండ్రికి తెలియదు. అడుగుతున్నాడు తనయుడు నేర్చిన విద్యావిశేషా లేమిటని— ఒక్క పద్యం చెప్పి అర్థతాత్పర్యాలు వివరించుమని. అర్థతాత్పర్యా లేమిటి? ఒక పద్యంలో పరమార్థసారాన్నే అందించినాడు ప్రహ్లాదుడు. చదివినవి పెక్కుశాస్త్రాలైనా చదువులసారం ఒక్కటేనని వడబోసి నిగ్గు దేల్చినాడు. 'చదువులలో మర్మమెల్ల చదివితి'నని తేటపరచినాడు. అంతగా తేటపరచినా తామసం ముదిరిన దైత్యనాథునికి అది అంతుపట్టలేదు. సాత్త్వికులకు మాత్రమే బోధపడే విషయం అది. ఆ మర్మం సాధుజన సంవేద్యం. అఖిల మునిజన హృద్యం. అది బ్రహ్మజ్ఞానం: ఆద్యం: అన వద్యం.

సమస్తవిద్యలకు సారభూతమైన బ్రహ్మజ్ఞానాన్ని ప్రవచించే ఈ పద్యం పరమ వ్యావహారికజగత్తులో సైతం ప్రచలితంగా ఉంది. పరమార్థంలోనా? కానక్కర లేదు. మామూలు లౌకిక ప్రసంగాలలో కూడా.

'ఎంతవరకు వచ్చింది నీ చదువు?'—ఒక ప్రశ్న

'చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ' — తడుముకోకుండా సమాధానం.

ఆ పంక్తికి అంత ప్రాణముంది కాబట్టే ఇన్నేళ్ళుగా ఇన్ని నోళ్ళుగా చలామణిలో ఉంది.

27. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు, నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు, ప్రాణులకును
బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా.

అహంకారానికి ప్రతిరూపం హిరణ్యకశిపుడు. సౌజన్య స్వరూపం ప్రహ్లాదుడు. ఇద్దరి మధ్య పెద్ద వాదమే జరిగింది. 'నేను తప్ప ఇంకెవడు గొప్ప' అని తండ్రి పిడివాదం. 'అందరినీ మించినవాడు ఆపై నొకడున్నాడు' అని కొడుకు సంవాదం. 'ఎవని బలం చూసుకుని వాదిస్తున్నావు?' అంటే 'ఎవడు సృష్టికే కాదు సృష్టికర్తకే బలమో ఆ విభుడే నాకు బల'మని ఆ పరమ భక్తుని సమాధానం.

'బల' శబ్దం ప్రాసస్థానంలో మరీ మరీ రావడం ఈ పద్యానికి కొండంత బలం.

28. కాననివాని నూఁతగొని కాననివాఁడు విశిష్టవస్తువుల్
గానని భంగిఁ గర్మములు గైకొని కొందరు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ; గొంద ఱటఁ గందు రకించన వైష్ణవాంఘ్రి సం
స్థానరజోఽభిషిక్తు లగు సంహృతకర్ములు దానవేశ్వరా!

విష్ణువు సర్వాత్ముడు. జీవులు కర్మబద్ధులు. వెలుతురులో ఉన్నా చీకటిలోనే ఉంటారు. చూస్తున్నా మనుకుంటున్నా చూడ లేని స్థితిలో ఉంటారు. 'కానని' అనే మాటను మూడు నాలుగు సార్లు ప్రయోగించి ఆ జీవుల అంధతను అజ్ఞతను నొక్కి చెప్పి నాడు పోతన్న. మరికొంద రున్నారు. వారు ఈ కొందరి వంటి వారు కారు. సంహృతకర్ములు. భాగవతుల పాదధూళితో పవిత్రు లైనవారు. వారే విష్ణువును కనగలిగే వారు. కర్మబద్ధులకు విముక్త కర్ములకు ఉన్న భేదాన్ని తేటమాటలతో తెలిపిన పద్య మిది.

29. ఇందుఁ గలఁ డందు లేఁ డని
సందేహము వలదు; చక్రి సర్వోపగతుం;
డెందెందు వెదకి చూచిన
నందందే గలఁడు దానవాగ్రణి! వింటే!

'సర్వం విష్ణుమయం జగత్.' ఈ లోకమంతా విష్ణు మయమే. ఇది తెలుగునాట బాగా వాడుకలో ఉన్న మాట. ఈ పద్యానికి ఇదే పునాది. అయితే కట్టడంలో పోతన్న పని తనం కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది. మొత్తం పద్యాన్ని

గడియలో ఏ ఢిల్లీలోనో ఉంటే ఆ వార్తను విన్న తెలుగువాడు వ్యాఖ్యానిస్తాడు—'అబ్బో! ఆయనకేం? ఇందు గల డందు లే దని సందేహము వల' దని.

ఎన్నో సందర్భాలలో నెమరు వేసుకోవడానికి ఉపయోగ పడే పద్య పాదాలు పోతన్నవి. అందుకే అతడు 'ఇజం' ఎరుగని ప్రజాకవి.

30. నన్నుఁ గన్నతండ్రి, నా పాలిదైవమ!
నా తపఃఫలంబ, నా కుమార,
నాదు చిన్ని వడుగ, నా కులదీపక,
రాఁగదయ్య, భాగ్యరాశి వగచు.

ఇవి వామనుణ్ణి కన్న తల్లియైన అదితి మాటలే కానక్కర లేదు. ఏ తెలుగు తల్లైనా ఇలాగే అంటుంది. ఎద చేపిన వాత్సల్యంతో మూర్తి కట్టిన మాతృత్వంలో నడిచే ఈ పద్యానికి జీవం నన్ను 'గన్నతండ్రి' అనే అచ్చ తెలుగు పలుకుబడి.

కన్నకొడుకును కన్నతండ్రి అని పిలవడం తెలుగుభాషకు దక్కినవరం.

31. జో జో కమలదళేక్షణ,
జో జో మృగరాజమధ్య, జో జో కృష్ణా,
జో జో పల్లవ కరపద,
జో జో పూర్ణేందువదన జో జోయనుచున్.

కందంలో అందంగా ఇమిడిన జోలపాట ఇది. 'జో అచ్యుతా నంద జో జో ముకుంద' అనే జోలపాట పాటల్లో ఎంతపేరు మోసిందో, పద్యాల్లో ఇది అంత వాసి కెక్కింది. ఎందరెందరో తెలుగుతల్లులు ఇది పోతన్న పద్యమని తెలియకుండానే మనసార

పాడుకునేవారు: మాతృత్వమాధుర్యాన్ని తనివితీరా అనుభవించే వారు.

ప్రాసస్థానంలో 'జో. జో' అంటూ ఉండడంవల్ల, మధ్య మధ్య కృష్ణపరమైన ముచ్చటైన సంబోధనలుండడంవల్ల ఇటు రక్తికీ అటు ముక్తికీ మూలకందమైంది—ఈ కందం.

32. అమ్మా, మన్ను దినంగ నే శిశువునో? యాఁకొంటినో? వెఱ్ఱినో?
నమ్మంజూడకు వీరి మాటలు మది; న్నన్నీవు కొట్టంగ వీ
రి మ్మార్గమ్ము ఘటించి చెప్పెదరు; కాదేనిన్ మదీయాస్య గం
ధ మ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే!

గోపాలకృష్ణుని బాల్యలీలలను వివరించే ఘట్టమిది. ఒక నాడు చిన్నికృష్ణుడు మన్ను తిన్నాడు. బలభద్రుడు మొదలైన గోపకుమారులు యశోదకు ఈ విషయాన్ని చేరవేసినారు. 'ఒరే నాన్నా! మన్నెటికి తిన్నావురా? తినడానికి మరే పదార్థం లేదా?' అని ఆ పిచ్చితల్లి అడుగగా ఆ చతురమూర్తి ఇలా అంటాడు— 'అమ్మా నేను పసివాణ్ణా? పిచ్చివాణ్ణా? వీళ్ళ మాటలను నమ్మకమ్మా! నన్ను కొట్టించడానికి ఎత్తువేసినారు. కాదంటావా? అయితే నా నోరు చూడు! ఆఁ! తప్పయితే అప్పుడు దండించు.'

ఒతే ఎత్తువేసినాడు ఆ లీలా గోపాలుడు. 'అమ్మా! మన్ను తినంగ నే శిశువునో' అంటాడు. నిజమే! అతడా శిశువు? బ్రహ్మాండ భాండాలే ఆ అవతార పురుషుని కంటికి ఆటబంతులు. 'నేను వెఱ్ఱినా?' అంటాడు. నిజమే మరి! సమస్త జీవకోటులకు వెఱ్ఱెక్కించే సౌందర్యాభిరాముడు ఆ మహానుభావుడు. ఇంతకూ ఆ జగజంత యశోదమ్మకు తన ఈశ్వరత్వాన్ని చూపించాలని వేసిన ఎత్తది.

'నేను', 'శిశువునో', 'వెర్రినో', అన్న చిన్నచిన్న మాటల్లో పరమాత్మతత్త్వాన్ని ధ్వనింపజేసినాడు పోతన్న.

౬౩. కలయో ! వైష్ణవ మాయయో ! యితర సం
కల్పార్థమో ! సత్యమో !
తలపన్నేరక యున్నదాననొ ? యశో
దాదేవిఁ గానో! పర
స్థలమో ! బాలకుఁ డెంత ? యీతని ముఖ
స్థంబై యజాండంబు ప్రా
జ్వల మై యుండుట కేమి హేతువొ ? మహా
శ్చర్యంబు చింతింపఁగన్.

అన్నట్టుగానే ఆ మన్నుదొంగ నోరు తెరువనే తెరిచినాడు. అను కున్నట్టుగా ఆ వెర్రితల్లి చూడనే చూసింది. ఏమిటి?— మన్నేనా? అక్షరాలా. కానీ, మరోరూపంలో—సముద్ర, పర్వత, భూగోళ, సూర్య చంద్ర, దిక్పాలురతో కూడుకున్న బ్రహ్మాండ రూపంలో — చూసింది. చూసింది: కృష్ణుని నోరు తెరిపించి చూసిన తానే నోరు తెరిచింది. ఎక్కడి బాలుడు? ఏమిటీ ఆశ్చర్యం? ఎక్కడి ముఖం? ఎక్కడి బ్రహ్మాండం? నిజమని ఎట్లా నమ్మేది? కల కావచ్చు. లేక వైష్ణవమాయ కావచ్చు. ఇంతకూ తాను యశోదా దేవి కాక పోవచ్చు. ముగ్ధ యశోదమనసులో సహజభాసురంగా చెలరేగిన తలపులవి.

ఈ అనుమానాల వెనుక పరమసత్యం దాగి ఉన్నది. యశోద పేరిట ఉన్న ఆ జీవికి నిజంగా అది కలయే. అవశ్యం అది వైష్ణవమాయయే. తాను 'యశోదాదేవిని కానేమో' అన్న ఊహలోనే ప్రాణిసహజమైన భ్రాంతియవనికను తొలిగించినాడు పోతన్న. అద్భుతత్వం మిషతో ఆత్మావిష్కరణం కావించినాడు పోతన్న.

అయితే తన కొడుకు పరమేశ్వరుడని యశోద తలచింది క్షణకాలమే. తరువాత బోలెడు కథ జరుగవలసి ఉంది. అప్పటితో ఆ మాయ ముగిసింది. మళ్ళీ ఎప్పటి యశోదమ్మ. మామూలు గోపాలబాలుడు.

34. ఓయమ్మ ! నీ కుమారుడు
మా యిండ్లను బాలు పెరుఁగు మననీఁడమ్మా !
పోయెద మెక్కడి కైనను ;
మా యన్నల సురభు లాన, మంజులవాణీ.

యశోదమ్మతో ఇరుగుపొరుగు గోపెమ్మల మొర ఇది. తమ ఇండ్లలో పాలూ పెరుగూ కాజేస్తున్నాడని; తాము ఎక్కడికైనా వెళ్ళిపోతామని వారి గోడు. ఎక్కడికి పోతారు? తమ అన్నలున్న చోటికి. అంటే పుట్టింటికి. ఆ పుట్టింటి మీద ఒట్టేసుకోవడంలో వాళ్ళు ఎక్కడికి పోదల్చుకున్నారో తెలుస్తుంది.

ఏముం దీ పద్యంలో? 'ఓ యమ్మ నీ కుమారుడు' అని ఎత్తుకోవడంలో ఉంది. ఆ మొరను, వారి తొందరను సహజ సంభాషణలో చిత్రించడంలో ఉంది.

ఏ అలంకారమూ లేకపోవడమే యీ పద్యానికి అలంకారం.

35. మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
నూరుఁగాయలు దినుచుండు నొక్కఁ;
దొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి
చూడు లే దని నోరు సూపు నొక్కఁ;
డేగు రార్గురఁ జల్ది లెలమిఁ బన్నిద మాడి
కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ;
డిన్ని యుఁ దగఁ బంచి యిడుట సేచ్చెలితన
మనుచు బంతెనగుండు లాడు నొకఁడు;

కృష్ణుఁ జూడు మనుచుఁ గికురించి పరు ప్రొలి
మేలి భక్ష్యరాశి మెసఁగు నొకఁడు;
నవ్వు నొకఁడు; సఖుల నవ్వించు నొక్కఁడు;
ముచ్చటాడు నొకఁడు; మురియు నొకఁడు.

చుట్టూ గోపబాలురు కూర్చున్నారు. మధ్యలో బాలకృష్ణుడున్నాడు. అందరూ కలసి నవ్వుతూ, తుళ్ళుతూ, ఇకిలిస్తూ, కికురిస్తూ తెచ్చుకొన్న చద్దులు తింటున్నారు. ఆ తినే తీరును, ఆ కుఱ్ఱవాళ్ళ హుషారును అప్పటికీ ఇప్పటికీ కళ్ళకు కట్టేటట్లు చిత్రించినాడు పోతన్న. ప్రతి పలుకుబడిని తూచి తూచి వేసినాడు. ఆ వ్రేలు మడిచి ఊరించడం, ఊరగాయలు తినడం, ఒకని కంచం లోనిది మరొకడు గబుక్కున మింగి 'చూడు లే'దని నోరుచూపడం, పందెం కాచి ఐదారుగురు తినవలసిన బువ్వను పట్టించి, దట్టించి ఒక్కడే తినడం....ఓ! ఎన్నెన్ని సరదా చేష్టలు! ఎంతటి స్వాభావిక చిత్రణం!

ఇప్పటి పిక్నిక్ వాతావరణానికి ఎప్పుడో బొమ్మకట్టి చూపినాడు, ఆ సహజ కవి.

౨౮. కర్ణాలంబితకాకపక్షములతో గ్రైవేయహారాళితో
స్వర్ణభ్రాజితవేత్రదండకముతో సత్పింఛదామంబుతోఁ
బూర్ణోత్సాహముతో ధృతాన్నకబళోత్ఫుల్లాబ్జహస్తంబుతోఁ
దూర్ణత్వంబున నేగె లేఁగలకునై దూరాటవీ వీథికిన్.

చద్దులుతినే సంబరంలో ఉన్నారు గోపకులు. పచ్చని గరిక జొంపాల ముచ్చటకులోనై దూరదూరాలకు వెళ్ళిపోయినవి గోవులూ లేగలూ. ఆ లేగలను మళ్ళించడానికి సాగిపోతున్న గోపాలమూర్తిని నయనాభిరామంగా చిత్రించినాడు పోతన్న.

కూర్చిన సమాసాలు, సమకూర్చిన మధురాక్షరాలూ రమణీయచిత్రణకు మారాకు హత్తినవి.

చెవులదాక వ్రేలాడు కురులగుత్తులతో మెడలో మిలమిల లాడు రత్న హారాలతో. చేతిలో నిగనిగలాడు పుత్తడిబెత్తంతో. సిగలో కలకలలాడు నెమలిపింఛంతో. పూర్ణోత్సాహంతో పురోగమిస్తున్నాడు ఆ చిన్నారి గోపన్న. ఈ వర్ణనంతా ఒక ఎత్తు. 'ధృతాన్నకబళోత్ఫుల్లాబ్జహస్తంబు'తో అన్న కొసరు మరొక ఎత్తు. ఈ గోపబృందం చల్దులు తినడం పూర్తికాకముందే గోబృందం వెళ్ళిపోయింది. 'మరేమీ తొందరలేదు. మీ సాపాటు కానియ్యండి నా పాటు నేను పడతాను' అని తినవలసిన అన్నపుముద్దను అర చేత పట్టుకొని బయలుదేరినాడు ఆ హాయలుకాడు.

నందనందనుని అలంకారాలకు వింతసొబగును కూర్చింది ఆ ఇంత అన్నపుముద్ద. మాటలా మరి! మాధవభక్తుడైన పోతన్నకు కన్పడిన గోపాలకృష్ణుని నిసర్గరూప మిది.

37. నల్లనివాఁడు పద్మ నయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళిపరిసర్పితపింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వలమానధనంబు దోఁచెనో
మల్లియలార! మీ పొదల మాటున లేఁడు గదమ్మ! చెప్పరే.

పైకి ప్రణయకలాపంగా కనిపించే గోపికాకృష్ణుల సంబంధం నిజానికి జీవాత్మపరమాత్మల అనుబంధం. గోపిక లెవరు! ఆ గోపాలచూడామణి ఎవరు? ఎందరో గోపికలు. ఒక్కడే కృష్ణుడు. ఇందరు గోపసుందరులు ఆ ఒక్క నల్లనయ్యను ఎందుకు వలచినట్లు? వెర్రెత్తి పరిపరివిధాలుగా ఎందుకు పిలిచినట్టు? ఇంతకు వారి వయస్సెంత? గోపాలుని ప్రాయ మెంత? స్థూలదృష్టికి పొరాడే ప్రశ్న లివి. సూక్ష్మదృష్టికి తళుకాడే సమాధానాలు వేరు.

ఆ కృష్ణుడు కేవలం గోపాలకృష్ణుడు కాడు అవతారపురుషుడు. చేరెడేసి కన్నులతో. తలపై నెమలికుచ్చులతో. కరుణ

వెదజల్లే చూపులతో, మరులూరించే నవ్వులతో తమ మానధనాన్ని దోచుకున్న శృంగారమూర్తే ఆ గోపాంగనలకు కనిపిస్తున్నది. కాని, లోతుల్లోకి వెళితే ఆ 'నల్లనివాడు' నీలమేఘశ్యాముడు. ఆ 'పద్మనయనంబులవాడు' పుండరీకాక్షుడు. ఆ 'కృపారసంబు పై జల్లెడువాడు' అపారకరుణాసాగరుడైన శ్రీమన్నారాయణుడు. అతడు దోచినది 'చెల్వల మానధనం' కాదు. వారి వ్యామోహగుణం. ఆ అల్లరిగోపాలు డే డని అడుగుతున్న దెవరిని? మాటా పలుకూ ఎరుగని మల్లెలను. అవి బదులుపలుకుతా యనే అడుగుతున్నారా వారు? కామార్తులకు ఏది చేతనం, ఏది జడం? ఎవరు చెప్పగలరు? ఆ కామార్తిలో—కడ ఎరుగని ఆ విభ్రాంతిలో— సలసల కాగిన జీవాత్మల ఆక్రందనానికి సుందరరాగ కల్పనం ఈ సురుచిర పద్యం.

ఈ పద్యం ప్రతితెలుగువాని రసనాగ్రంపై కదలాడడానికి 'నల్లనివాడు' అన్న చల్లని తెలుగునుడి ఒక కారణం కాకపోదు.

మొదటిపాదంలో 'నల్లనివాడు' చివరిపాదంలో 'మల్లియలార' ఈ రెండుపదాలు ఈ పద్యమూర్తికి ఇరు భుజాలు.

38. అదె నందనందనుం డంతర్హితుం డయ్యెఁ
బాటలీతరులార! పట్టరమ్మ!
పేలావతులఁ గృష్ణ! యేల పొసితి వని
యైలేయ లతలార! యడుగరమ్మ
వనజాక్షుఁ డిచటికి వచ్చి డాఁగఁడు గదా
చూతమంజరులార! చూడరమ్మ!
మానినీమదనుతో మా రాక యెఱిఁగించి
మాధవీ లతలార! మనుపరమ్మ!
జాతిసతులఁ బాయు నీతియె హరి కని
జాతులార! దిశలఁ జాటరమ్మ!
కదళులార! పోయి కదలించి శిఖిపింఛ
జూటుఁ దెచ్చి కరుణఁ జూపరమ్మ!

అందాకా తమతో కూడి యాడి అంతలోనే మాయమైన మురళీలోలుణ్ణి అన్వేషిస్తున్నారు మదనపరవశలైన గోపికలు. మదిలో మదనుడు చొరబారితే కలిగే అవస్థలు ఇన్నన్ని కావు. కన్నెసిగ్గు కరిగిపోతుంది. మేనివన్నె తరిగిపోతుంది. ఏదీ రుచించదు. ఏ దిక్కూ తోచదు. ఏదేదో ఉన్మాదం. ఏమేమో ప్రలాపం. ఈ పద్యంలో ఉన్న మన్మథావస్థ ఆ ప్రలాపమే. మరుని తొందరలో ఓపికలు పోయిన గోపికలు విరహిణులై విహ్వలలై తరులనూ విరులనూ వల్లరులనూ మంజరులనూ అడుగుతున్నారు. 'ఏడి? తమ మానస చోరు డేడి?' అని. వారి ప్రలాపాన్ని, విరహాలాపాన్ని సహజ రమ్యంగా చిత్రించిన పద్య మిది. అయితే ఈ ఉన్మత్త ప్రలాపం కేవలం ఆంగిక సంక్షోభంవల్ల కలిగింది కాదు. పంచేంద్రియ తర్పణమే దీనికి పరమావధి కాదు. మధురభక్తిలో ఒక విచిత్రదశ. ఈ పిలుపు సమ్ముగ్ధచిత్తలైన ఆ గోపికల అంతరాత్మలకే మేలుకొలుపు.

39. కిటి యై కౌఁగిటఁ జేర్చెను,
పటుఁడై వర్ధిల్లి కొలిచె వడిఁ, గృష్ణుండై
యిటఁ బదచిహ్నము లిడెఁ గ్రిం
పటి బాముల నేమి నోఁచితమ్మ! ధరిత్రీ!

హరి వరాహమూర్తి యై ధరిత్రిని కౌగిట చేర్చుకున్నాడు. వామనమూర్తి యై బ్రహ్మాండాన్ని కొలిచినాడు. శ్రీకృష్ణమూర్తియై తన అడుగుజాడలతో పుడమిని పూతం చేసినాడు. గతజన్మలో ధరా పురంధ్రి నోచుకున్న పుణ్య మది. గోపాలమౌళి పాదాల గుర్తులను కనుగొన్న గోపికల భావపరంపర ఇది. వేలలుగా అగుపించే గోపాంగనల నోట వాసుదేవుని మూలతత్త్వమే పలికింది. మూడు అవతారాలలోను భూరమణికి నారాయణునికి ఉన్న సాంగత్యమే ఈ పద్యంలో ధ్వనించింది.

40. భూషణములు సెవులకు, బుధ
తోషణము, లనేకజన్మ దురితౌఘ విని
శ్శోషణములు, మంగళతర
ఘోషణములు గరుడగమను గుణభాషణముల్.

రుక్మిణీ కల్యాణఘట్టానికి తిలకంలాంటి పద్యమిది. ఈ తిలకం దిద్దుకున్న తర్వాతనే కథాకల్యాణి కదలాడుతుంది. గరుడగమనుని గుణగణకీర్తనలు ఎంత విలువైనవో తెలుపుతుంది పద్యం. అవి కర్ణభూషణము లట. పండితులను అలరించేవట. అనేకజన్మల పాపాలను తొలిగించేవట. కల్యాణప్రదములైన నినాదము లట.

ఈ పద్యంలో అర్థంకంటె శబ్దం, ఆ శబ్దరూపంకంటె అది పలికించే నాదం ముఖ్యమైనది. లాక్షణికదృష్టికి 'భూషణములు' 'తోషణములు' ఇత్యాది ప్రాసస్థానాలు త్రిప్రాసస్థానాలు త్రిప్రాసం కిందికో చతుప్ర్పాసం కిందికో వస్తాయి. కాని, ఇవి ఒకరకంగా వాక్యం చివర ఉండే అంత్యప్రాసస్థానంలోఉన్నా అంత్యప్రాసల దరువుల్లాగా శ్రవణ సుఖాన్ని కూర్చే కూర్పులివి.

ఇలాంటి పద్యాలు వ్రాయడం పోతన్నకు మామూలే. చెప్ప దలచుకున్నవస్తువు చిక్కనిది కానప్పుడు మధ్యమధ్య ఇలాంటి ప్రాసక్రీడలకు లోనవుతుంటాడు. వాసుదేవుని గుణభాషణములు వర్ణించా లని మనస్సు చెప్పింది. ఇంకేమి? 'భాషణములు' అనే మాటకు సరితూగే పదాలు ప్రాసస్థానంలో తమంత తామే వచ్చి కుమురుకున్నవి 'భూషణములు' 'తోషణములు' 'శోషణములు' 'ఘోషణములు' అంటూ.

ఈ పద్యాన్ని పిండితే వచ్చే అర్థం ఆవంత. చదివితే ఉదయించే నాదం కొండంత. పోతన్నకు పుట్టెడు పేరు తెచ్చిన గుణాల్లో ఈ అక్షరరమ్యత ఒకటి.

41. బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు సేయుఁగ వారల నడ్డుపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణు నెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై.

ఉదితయౌవనయైన రుక్మిణి తన తండ్రి ఇంటికి వచ్చిపోయే అతిథులవల్ల కృష్ణుని అందచందాలను గూర్చి, శౌర్యసాహసాలను గూర్చి విన్నది. తనకు విభుడు అతడే అని నిశ్చయించుకున్నది.

అక్కడ హరి కూడా బాలామణి రుక్మిణి తనకు తగిన ఇల్లాలని అనుకున్నాడు. రుక్మిణి బంధువులందరూ ఈ ఆలోచనలోనే ఉన్నారు. వారు "శేముషీ సింధువులు" కాబట్టి.

అందరికీ అడ్డుపుల్లగా తయారైనాడు. రుక్మిణి అన్న రుక్మి. ఆమెను శిశుపాలునికి కట్టబెట్టాలనే పన్నాగంలో ఉన్నాడు-అతడు అంధుడూ దుస్సంధుడూ కాబట్టి. ఈ అంధత్వం కంటికి సంబంధించింది కాదు: మతికి సంబంధించింది. అతని మతిని చీకటి ఆవరించింది. తామసం ప్రకోపించింది. తమోగుణ భూయిష్ఠునికి బుద్ధిమంతుల విచారాలు తలకిందులుగా కనిపిస్తాయి. అందుకే వాడు దుస్సంధు డయినాడు.

'సంధ' అంటే సంయోగం. రుక్మిణీ కృష్ణుల సంయోగం లక్ష్మీనారాయణుల సంయోగం. ఇది సుసంధ. రుక్మిణిని శిశుపాలునికి కూర్చాలనే దృక్పథం దుస్సంధ. ఇది అయోగ్యం. తామసాంధుడైన రుక్మి దుస్సంధుడు గాక మరే మవుతాడు?

మూల భాగవతంలో 'అంధుడై' అనే మాటకు బదులు 'కృష్ణద్వేషి' అని ఉన్నది. కృష్ణద్వేషి అంటే ఆ ప్రత్యేకవ్యక్తిని దూషిస్తున్నవాడు. తెలుగులో 'అంధుడై' అనడంవల్ల రుక్మి సహజధూర్తప్రకృతి బయటపడింది. "శేముషీసింధువు" లనే

మాట కూడా పోతన్న చేర్చే. "విచారములు సేయగా" అనేది ఈనాటికీ ఆ అర్థంలోనే వాడుకలో ఉన్న పలుకుబడి.

42. ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
            దేహతాపంబులు దీఱిపోవు;
    నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
            కఖిలార్థలాభంబు లబ్బుచుండు;
    నే నీ చరణసేవ లే ప్రొద్దు చేసిన
            భువనోన్నతత్వంబుఁ బొందఁగలుగు;
    నే నీ లసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ
            దడవిన బంధసంతతులు వాయు,
    నట్టి నీయందు నా చిత్త మనవరతము
    నచ్చియున్నది; నీ యాన; నాన లేదు;
    కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
    శ్రీయుతాకార! మానినీచిత్తచోర!

రుక్మిణి పంపిన పరిణయసందేశంలో ప్రథమపద్య మిది. కృష్ణుడు ఆ బాలామణిదృష్టికి కేవలం కంసారి, ఖలవిదారిమాత్రమే కాదు. శ్రీయుతాకారుడు: మానినీచిత్తచోరుడు కూడా. తాను మానిని. తన చిత్తమును ఏ నాడో దొంగిలించినాడు ఆ శ్రీధరుడు. అతడు కేవలం గోపాలుడు కాడు. శ్రీపాలుడు. కన్నెగా ఉన్న రుక్మిణికి జన్మాంతరసంస్కారంవల్ల కైముత్యంలా భాసించిన సత్య మిది. అందుకే ఈ సంబోధనలను అంతబరువుగా ప్రయోగించింది. తన శరీరంలోని సర్వేంద్రియాలు సమస్తాణువులు అతని పొందుకొరకు తహతహలాడుతున్నాయని చాటులేని మాటలలో తేటపరచింది. 'నీ యాన, నాన లేదు' అని అన్నది. "నీయాన" అంటే నీతోడుసుమా! 'నాన' అంటే సిగ్గు. కన్యాసహజమైన సిగ్గును కూడా విడిచి కేలొగ్గి అడిగింది తనను కరుణించు మని. అతని రూపం చూస్తే కనుల పండువట! అతని చర

ణాలను సేవిస్తే మహోన్నతి కలుగుతుందట! అతని పేరు తలిస్తే భవబంధాలు తొలగిపోతాయట! ఎవ రీతడు? ప్రియుడేనా? కాడు. విశ్వమయుడు. తనకు కాబోయే వరుడేనా? కాడు! విశ్వేశ్వరుడు.

నవవిధభక్తుల్లో నాలుగు భక్తిమార్గాలను ఈ పద్యంలో పొందుపరచినాడు పోతన్న. మొదటి పాదంలో శ్రవణం. రెండవ పాదంలో దర్శనం. మూడవ పాదంలో పాదసేవనం. నాలుగవ పాదంలో కీర్తనం. మొదటి రెండుపాదాలు మూలంలోనివే. తరువాతివి రెండు పోతన్న చేర్చినవి. నాలుగు పాదాలలో నాలుగు విధాల భక్తిపథాలను నిర్దేశించి ఆ శృంగాటకం మీద రుక్మిణిని అధిష్ఠింపజేసినాడు. ఇప్పుడు కనిపిస్తున్న రుక్మిణి బాలామణి మాత్రమే కాదు. మధురభక్తికి సంకేతంగా నిలిచిన మానినీశిరోమణి.

'ఏ ని' అని ఎత్తుకొని నాలుగుపాదాలవరకు నిర్వహించడంలో ఉంది ఈ పద్యంలోని సగం అందం.

43. ధన్యున్ లోకమనోభిరాముఁ గుల విద్యారూపతారుణ్య సౌ
జన్య శ్రీ బలదాన శౌర్యకరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు? కోరదే మును రమాకాంతాలలామంబు రా
జన్యానేకపసింహ, నా వలసనే జన్మించెనే మోహముల్ ?

రుక్మిణి శ్రీకృష్ణుణ్ణి వలచింది. తాను వలచిన సంగతి సిగ్గు విడిచి తెలిపింది. అంతటితో ఊరుకోలేదు. తనకు కలిగిన మోహాన్ని ఒక చతురుడైన న్యాయవాదిలా సమర్థించడానికి పూనుకుంది. కృష్ణుని సకల సద్గుణాల పట్టిక ఇచ్చింది. అబ్బబ్బ! ఎన్ని గుణాలని! వంశం. విద్య. రూపం. యౌవనం. సంపద, శౌర్యం. దానం. దయ–ఇన్ని గుణాలు కలబోసిన మూర్తిని [illegible]

కోరరు? అని ప్రశ్నించింది. 'నేను కోరుతున్నాను' అంటే చాలదా? ఎంద రెందరో కోరుతున్నారు కాబట్టి తాను కోరుతున్నదా? ఏమి టీ వాదం? అతడు లోకాభిరాముడు కాబట్టి అందరూ కోరడం సహజం. వలచే ఆ కోటొక్కవనితల పంక్తిలోనేనా తనకు స్థానం? కాదు. తొల్లిటి లక్ష్మితో తనకు సాజాత్యం ఉంది. నాడు లక్ష్మి వలచింది. అతడు శ్రీపతి అయినాడు. నేడు తాను వలచింది. అతడు రుక్మిణీపతి కాక తప్పదు. ముందు ఎందరో కన్యలకు కలిగిన వలపును ప్రస్తావించి. తరువాత ప్రత్యేకంగా లక్ష్మిని పేర్కొనడం రుక్మిణి చురుకు దనాన్ని సూచిస్తున్నది. వెన్న దొంగను వెర్రిమొర్రిగా వలచిన బేల కాదు రుక్మిణి. తాను అతన్ని జన్మ జన్మలకు ప్రేమించే సర్వస్వామ్యాలున్న సాక్షాత్ లక్ష్మి స్వరూపిణి.

ఈ పద్యంలో "రాజన్యానేకపసింహ" అనేది సాభిప్రాయ సంబోధనం. రుక్మిణీ హరణంలో రణం తప్పదు. మత్తెక్కిన రుక్మి, శిశుపాలుడు మొదలైన రాజులు మదపుటేనుగుల్లా ఎదురుతిరుగు తారు. శ్రీకృష్ణుడు వారిపాలిటి సింహమై విక్రమిస్తాడు. వారి గర్వాన్ని ఛేదిస్తాడు. ఇంతటి నిశ్చయం తన కుంది. అందుకే ఆమె సంబోధనలో జరుగనున్న కథ ధ్వనించింది.

44. శ్రీయుతమూర్తి, యో పురుష
సింహము, సింహము పాలి సొమ్ము గో
మాయువు కోరు చందమున
మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడిఁ
దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం దెలిసి
దద్భుతమైన భవత్ప్రతాపమున్.

కృష్ణుణ్ణి పదేపదే శ్రీపతిగా సంబోధించందే రుక్మిణికి తృప్తి లేదు. తనకు తెలియకుండానే తానే లక్ష్మిననే అభిప్రాయం ఆమె వాదనలో తొంగి చూస్తున్నది. అతడు పురుషసింహుడు అంటే పురుషోత్తముడు. పురుషు లెందరున్నా పురుషోత్తము డొక్కడే: అతడు శ్రీమన్నారాయణుడు. తాను అతని సొత్తు. తన జీవితధ్యేయం హరిచరణకమలధ్యానం. అలాంటి తనను కొనిపోవా లనుకుంటున్నాడు శిశుపాలుడు. వాడు మత్తుడు, వాడి మత్తత ఒంటికి సంబంధించింది కాదు. ఊహకు సంబంధించింది. సింహంసొమ్మును గుంటనక్క కోరుకోవడం విపరీతం కాదు. శ్రీకృష్ణునికి అంకితమైన తనను శిశుపాలుడు వాంఛించడం ఆ విపరీతబుద్ధివల్లనే. వాడు అధముడే కాడు, అధమాధముడు. ఈ మాటల్లో ఆ బాలామణి శక్తిస్వరూపిణిగా స్ఫురిస్తున్నది. ఎక్కడి నుంచి వచ్చింది ఈమెకీ సత్తువ? కేవలం ఆ పరమాత్ముని పాదాంబుజధ్యానంవల్ల. శిశుపాలునిది కంటికీ ఒంటికీ పొరలు కప్పే తామసమార్గం. రుక్మిణిది కైవల్యమూర్తికి తనను తాను కానుకగా ఇచ్చుకున్న పరమసాత్త్విక పథం.

45. ప్రాణేశ, నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రంబుల కలిమి యేల?
పురుషరత్నమ, నీవు భోగింపగా లేని
తనులతవలని సౌందర్య మేల?
భువనమోహన, నిన్నుఁ జూడగానఁగా లేని
చక్షురింద్రియముల సత్త్వ మేల?
దయిత, నీ యధరామృతం బానఁగా లేని
జిహ్వకు ఫలరససిద్ధి యేల?
నీరజాతనయన, నీ వనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణ మేల?
ధన్యచరిత, నీకు దాస్యంబు సేయని
జన్మ మేల? యెన్ని జన్మలకును.

రుక్మిణి దాస్యభక్తితోపాటు పోతన్న కవితాశక్తిని ప్రదర్శించే పద్యమిది.

మానవ శరీరం పంచేంద్రియాల సంపుటి. చెవు లున్నాయి వినడానికి. చేతు లున్నాయి తాకడానికి. కళ్ళున్నాయి చూడ డానికి. జిహ్వ ఉంది రుచులానడానికి. నాసిక ఉంది వాసన చూడడానికి. ఇది సర్వప్రాణి సహజమైన లక్షణం.

కాని, రుక్మిణీదృష్టిలో పాంచభౌతికమైన తన శరీరానికి పరమావధి వేరు. ప్రాణేశ్వరుని సమాగమం. ఆ సమాగమంవల్ల కలిగే మహానుభవం తన పంచేంద్రియాల కలిమికి పరమార్థం.

ప్రాణేశుని మంజుభాషలు వినలేని తన కర్ణము లెందుకు? అతడు భోగించలేని తన తను వెందుకు? అతనిని చూడలేని తన కను లెందుకు? అతని అధరామృతం అనలేని తన జిహ్వ ఎందుకు? అతని వనమాలికా పరిమళం ఆఘ్రాణించలేని తన నాసిక ఎందుకు? అంతే కాదు. అతన్ని సేవించని తన జన్మ మెందుకు? శరీర సాకల్యానికి జన్మసాఫల్యానికి చేసిన మహోదాత్త సమన్వయ మిది.

పంచేంద్రియ సంపుటిలో పంచభూతాల గుణాలను ధ్వనింప జేయడం ఈ పద్యంలో ఉన్న రమణీయ రహస్యం. శ్రవణాలకు శబ్దగుణం. తనువుకు స్పర్శగుణం. నయనాలకు రూపగుణం. జిహ్వకు రసగుణం. నాసికకు గంధగుణం సహజ లక్షణాలు. ఈ లక్షణ పంచకాన్ని సుకుమార వ్యంగ్య ధోరణిలో సూచించినాడు పోతన్న.

46. కన్నియమీఁద నా వలఁపు గాథము; కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు నా వివాహము సహింపక రుక్మి తలంచు కీడు; నే
మున్నె యెఱుంగుదున్; బరుల మూఁక లడంచి కుమారిఁ దెత్తు వి
ద్వన్నుత, మాను ప్రచ్చినవ వహ్నిశిఖన్ వడిఁదెచ్చుకైవడిన్.

రుక్మిణి పంపిన సుదీర్ఘ సందేశాన్ని విన్నాడు. అలవోకగా నవ్వుతూ మూడు ముక్కల్లో తన అభిప్రాయాన్ని వెల్లడించినాడు. తన మనసంతా ఆ కన్నియ పైనే ఉందన్నాడు. తనకు నిదురే లేదన్నాడు. రుక్మి వక్రబుద్ధి తనకు తెలుసు నన్నాడు. ఎవ్వరెదుర్కొడ్డినా తన మనోహారిణిని హరించి తెస్తానని ప్రతిజ్ఞ చేసినాడు. ఏ రకంగా? జమ్మికొయ్యలను రాచి హోమాగ్నిని సాధించినట్టుగా. చిన్న సెలయేరుగా ప్రారంభమైన ఈ పద్యం మహాజలపాతంగా పరిణమించింది. అందరు ప్రేమికులు అన్నట్టుగానే అన్నాడు కృష్ణుడు— "ఆ అమ్మాయిని నేను విపరీతంగా ప్రేమిస్తున్నాను. ఆమెను తలచుకోని గడియ లేదు. రాత్రుల్లో నిద్ర రావడం లేదు" అన్న ధోరణిలో. కానీ, ప్రతిజ్ఞ చేసేసరికి అందుకు తగ్గ గంభీరమైన ఉపమానం వేసేసరికి పద్యం కొండంత పెరిగి పోయింది.

యజ్ఞానికి కావలసిన అగ్నిని జమ్మికొయ్యలను రాచి పుట్టిస్తారు. రుక్మిణి అలాంటి అగ్ని. రుక్మిణీహరణం యజ్ఞకార్యం వంటిది. ఈ పద్యానికి ప్రాణం ఈ అలంకారధ్వని.

"కూరుకు రాదు" అనేది తెలంగాణంలో ప్రచలితంగా ఉన్న పలుకుబడి.

47. ఘనుఁ డా భూసురుఁ డేగెనో; నడుమ మా
ర్గశ్రాంతుఁడై చిక్కెనో;
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో;
విచ్చేసెనో; యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో?
యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో?
నా భాగ్య మె ట్లున్నదో!

రేపు లగ్నం. భూసురు డింకా తిరిగి రాలేదు. గోవిందు డేమన్నాడో తెలియదు. ధీరగా, గంభీరంగా కల్యాణ సందేశాన్ని పంపిన రుక్మిణి తడబడి పోతున్నది: తల్లడిల్లి పోతున్నది చెప్పరాని ఆందోళన. ఎవరితోనూ చెప్పుకోలేని సందేహ పరంపర లక్ష్మి అంశలో పుట్టిన రుక్మిణికేనా ఈ సంశయాలు? "స్వామీ పూర్వం నిన్ను రమాకాంతాలలామం కోరింది. ఈ జన్మలో నేను కోరుతున్నాను. ఇందులో నా తప్పేముంది?" అని తన సందేశంలో అంత నిక్కచ్చిగా చెప్పిన రుక్మిణి ఇంత ముగ్ధగా, సందిగ్ధగా ఎలా మారిపోయింది?

ఈ పద్యంలో రుక్మిణి లక్ష్మీస్వరూపిణి కాదు. కేవల బాలామణి. కన్యాసహజమైన మోహం ఆవరించినప్పుడు అన్నీ సందేహాలే! చివరికి వెళ్ళవలసిన బ్రాహ్మణుడు వెళ్ళెనో లేదో అన్నంతదాకా సాగిపోయింది ఆ సందిగ్ధచిత్తం. వలచినహృదయం లోని ఆటుపోటులను సహజసుందరంగా చిత్రించిన పద్యమిది. ఇప్పటికీ మనలో సందేహాలు ముసురుకున్నప్పుడు ఈ పద్యం గుర్తుకొస్తుంది. అన్నీ ప్రశ్నలే ఉండడం ఈ పద్యంలోని మరొక విశేషం. అయితే మాంగల్యప్రదాయిని అయిన ఆ సర్వమంగళా దేవి సంస్మరణమే విపత్సాగరతరణం కాదా!

48. నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ మేటి పె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతి సేయు మమ్మ! నిన్
నమ్మినవారి కెన్నఁటికి నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!

నిన్నటి తరంవరకు తెలుగునాట కన్నెపిల్లలు భక్తి తాత్పర్యాలతో పాడుకున్న పద్య మిది. ఈ పద్యంలో ఉన్న జీవశక్తి ఆ భక్తి.

ఉమామహేశ్వరులు పురాణదంపతులు. అత్యంత సనాతనులు. లక్ష్మీ నారాయణుల కంటె సనాతనులు. మహేశ్వరుని అర్థాంగి యైన మహేశ్వరి దయాజలధి. కల్యాణ సంసిద్ధికి శేవధి. రుక్మిణి ఈ పద్యంలో మొదట ఈ పురాణ దంపతులను కలిపి కైవారం చేసింది. పిదప ఆ చల్లనితల్లికి ప్రత్యేకంగా ప్రణమిల్లింది.

పారవశ్యానికి దారితీసిన భక్తిభావనం. దానిని అరటి పండొలచినట్లు ప్రకటించ గలిగిన పదసంకలనం ఈ పద్యానికి నయనయుగళం.

ఆ యమ్మను 'అమ్మ' 'అమ్మ' అని ఐదుసార్లు సంబోధించడం ఈ పద్యం పొందిన ప్రాచుర్యానికి ప్రధాన కారణం.

49. అళినీలాలకఁ బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాళాధరన్
గలకంఠిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంధేభకుంభస్తనిన్
బులినశ్రోణి నిభేంద్రయాన నరుణాంభోజాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములై రందఱున్.

గౌరీపూజకు వెళ్లుతున్న రుక్మిణిని ఘంటాపథంలో మూగిన రాజవీరులు కనుగొన్నారు. వీరందరూ ఆమెనే చూస్తున్నారు. ఆమె 'హరిరాకకు' ఎదురుచూస్తూ నడుస్తున్నది. అలా నడుస్తుంటే ఆమె వీరమోహినిలా ఉందట. మామూలు మోహినిని చూస్తేనే తల తిరిగిపోయే ఆ రాకుమారులు 'వీరమోహిని'ని చూస్తే ఇంకేమవుతారు? 'విభ్రాంతాత్ములైనా'రట. అంటే వారి మనసులే చెదరిపోయినాయన్నమాట! ఆమె సర్వాంగ సౌందర్యం వారి కనులకు మిరుమిట్లు గొలిపింది. ముందు వారికి తుమ్మెదరెక్కలవంటి కురులు కనిపించినవి. తరువాత పున్నమిచంద్రబింబంవంటి ముఖం కనిపించిది. ఆ తరువాత జింక కన్నులు. పగడాల పెదవి.

కలకంఠం. పాదపల్లవాలు. కుచకుంభాలు ఇత్యాదులు. ఏమి టీ క్రమం? నిజమే! స్థూలదృష్టికి అలాగే కనిపిస్తుంది. కురులనుండి చరణాలవరకో, చరణాలనుండి కురులవరకో, వర్ణించవలసిందికదా! ఏమి టీ వ్యత్యాసం మరి? అక్కడే పోతన్న సాధించిన ఔచిత్యం పరాకాష్ఠ నందుకున్నది. చూసేవారు విభ్రాంతాత్ములు. మతి చెదిరినవారు. ఉన్మాదం ముదిరినవారు. ఆ జగన్మోహిని దుర్నిరీక్ష్య సౌందర్యాన్ని ఒక క్రమంలో చూడగలుగుతారా? ఈ దృష్టి ఉంది గనుకనే పోతన్న రెండు సాభిప్రాయపదాలు ప్రయోగించినాడు. ఆమె 'వీరమోహిని' అని వారు 'విభ్రాంతాత్ము' లని.

50. మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ;
నేపాటిగలవాఁడ; వేది వంశ;
మెందు జన్మించితి; వెక్కడఁ బెరిఁగితి;
వెయ్యది నడవడి; యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు; మర్యాద లెఱుఁగవు;
మాయఁ గై కొనికాని మలయరావు;
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు
వసుధేశుఁడవు గావు; వావి లేదు;
కొమ్మ నిమ్ము: నీవు గుణరహితుండవు;
విడువు; విడువవేని విలయకాల
శిఖిశిఖాసమాన శితశిలీముఖముల
గర్వమెల్లఁ గొందుఁ గలహమందు.

రుక్మిణిని ఎత్తుకుపోతున్న కృష్ణుణ్ణి అదలించి తూలనాడుతున్నాడు రుక్మి. అతని కులాన్నీ గుణాన్నీ పేరుపేరున ఎంచి దుయ్యబడుతున్నాడు. పైకిచూస్తే అన్నీ నిందలే. రుక్మి నిందలు తప్ప అభినందనలు చేసేవాడా మరి? ఒక దుష్టపాత్ర శిష్టరక్షకుణ్ణి చెడామడా తిడుతుంటే పాపం మన పోతన్న పులుకు పులుకున చూస్తాడు: 'అయ్యో! నా స్వామి తిట్లపాలౌతున్నాడే'

అని ఆందోళన పడుతాడు. ఆ దుష్టునికి తెలియకుండానే వాడి పాడునోట పరతత్త్వ రహస్యాలను పలికిస్తాడు. ఆ రకంగా తన మనసు నింపుకుంటాడు. ఈ పద్యంలో ఆ పనే చేసినాడు. అటు కృష్ణుడు ఇటు రుక్మి. ఇక తిట్లవెనుక దాగిన పరమార్థ మేమిటో చూద్దాం—

కృష్ణుడు రుక్మికి 'సరివాడు కాడు'—నిజమే! అందరికీ అతీతుడు. అతడు ఏపాటి గలవాడు?—ముల్లోకాలే అతనివి. ఆ సిరియే అతనిది. ఏది వంశం?—విష్ణుమూర్తికి ఒక వంశ మంటూ ఉంటుందా? ఎందు జన్మించితివి?—జన్మ లేనిదే.

ఎక్కడ పెరిగితివి?—పెరుగుట విరుగుట నరులకు, నారాయణుని కెక్కడిది?

ఎయ్యది నడవడి?—నడిపించేవాని నడవడి ఎవడెరుగును? మానహీనుడవు — అశరీరునికి, ఆత్మస్థిరునికి మానప్రసక్తి ఏది? మర్యాద లెరుగవు — అనంతు డతడు. మాయ గైకొనిగాని మలయరావు — సర్వమూ అతని మాయే. నిజరూపమున శత్రు నివహంబుపైఁబోవు—అన్ని రూపాలూ అతనివే. వసుధేశుఁడవు కావు నిజమే! ఒక్క వసుధకే కాదు, చతుర్దశభువనాలకే అధీశ్వరుడు.

వావి లేదు—త్రివిక్రమునికి క్రమంతో నిమిత్తం లేదు. గుణ రహితుండవు — గుణత్రయము జీవకోటికి, గుణాతీతుని కేటికి?

ఇది—పైన నిందగా కనిపించినా లోన స్తుతిని దాచుకున్న పద్ధతి. అలంకారాలలో వ్యాజస్తుతి.

51\. తగు నీ చక్రి విదర్భరాజసుతకున్, దథ్యంబు, వైదర్భియుం
దగు నీ చక్రికి, నింత మంచి దగునే దాంపత్య, మీ యిద్దఱిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా! దర్పాహతారాతి యై
మగఁ డౌఁ గావుతఁ జక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్.

హరిని చూచిన విదర్భపౌరులు అనుకున్నారట.—కృష్ణునికీ రుక్మిణికీ బలే జంట కుదిరిం దని. ఆ అనుకోవడంలో స్వచ్ఛమైన అమాయికత్వం ఉంది. మంగళకరమైన ఆకాంక్ష ఉంది. కృష్ణునికి రుక్మిణీ, రుక్మిణికి కృష్ణుడు అన్ని విధాలా తగినవారు. ఈ ఇద్దరిని తగులగట్టిన బ్రహ్మ నేర్పరి యుట. ఈ తగులగట్టడం అనేది పోతన్న సరికొత్తగా కూర్చిన నుడికారం. ఈ మాటకు ఇటీవలి కాలంలో ఉన్న అర్థం వేరు. ఇష్టంలేని సంబంధాన్ని 'తగుల గట్టడం' అంటారు. పోతన్న కాలంలో ఈ మాటకున్న అర్థం వేరు. 'తగులు' 'తగులం' అంటే ఆసక్తి. అనురాగం. ఆ ఇద్దరి హృదయాలలో ఒకరి పట్ల ఒకరికి తగులం ఏర్పడింది. ఈ రాగబంధాన్ని ఎరిగిన బ్రహ్మ వారి వివాహబంధాన్ని ఏనాడో నిర్ణయించినాడు. అందుకే అతడు బ్రహ్మ. ఆ నేర్పు అతనికే చెల్లింది. సామాన్యపౌరులు అమాయికంగా పలికిన పలుకుల వెనుక ఇంతటి గంభీరార్థాన్ని పొదిగినాడు పోతన్న.

ఈ పద్యంలో కృష్ణుడు మాటిమాటికి చక్రిగా కనిపిస్తాడు. రుక్మిణి వైదర్భి గానే భాసిస్తుంది. పర్యాయపదాలు కరువా, తిప్పితిప్పి గుప్పించడానికి. పదే పదే చక్రి చక్రి అంటా డేమిటి? అప్పుడు కావలసిందీ, అక్కడికి రావలసిందీ గోపాలబాలుడో మురళీలోలుడో కాదు. చక్రధారియైన సర్వేశ్వరుడు. వచ్చింది తా వలచిన ఒక సామాన్య కన్యకోసం కాదు. విదర్భరాజు పుత్రిక కోసం, మరో రూపంలో పెరుగుతున్న రమాభగవతి కోసం. అందుకే పోతన్న అన్నిసార్లు కృష్ణపరంగా చక్రిని, రుక్మిణీపరంగా 'వైదర్భి'ని ప్రయోగించినాడు.

52. ధ్రువకీర్తిన్ హరి పెండ్లి యాడె నిజచేతోహారిణిన్ మానసై
భవ గాంభీర్యవిహారిణిన్ నిఖిలసంపత్కారిణిన్ సాధుబాం
ధవ సత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీచూడామణిన్ రుక్మిణిన్.

ఇది రుక్మిణీకృష్ణుల కల్యాణం. అంత్యప్రాసల దొంతరతో పోతన్న చేసిన కావ్యగానం. అతడు హరి. ఆమె చేతోహారిణి. ఈ జన్మలోనే కాదు అతని హృదయాన్ని హరించినది. ఆనాడే- సంపత్కారిణిగా, ఇందిరాసుందరిగా అతనిని చేపట్టిననాడే. ఆ దంపతులే ఈ దంపతులు. ఆనాటి పెండ్లి క్షీరసాగరతీరంలో జరిగింది.

రుక్మిణీ కృష్ణుల కల్యాణం అఖిలభువనకల్యాణం.

*
* *
*